ట్యాంకులోని నీటిని పరిశీలిస్తున్న జిల్లా అధికారి జయప్రకాశ్



సాంఘిక సంక్షేమ వసతి గృహాల మౌలిక వసతులకు రూ.13.19 కోట్లు


- జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి జయప్రకాశ్

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13.19 కోట్లు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి జయప్రకాశ్ తెలిపారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూడు వసతి గృహాల్లోని సమస్యలను గుర్తించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చిలో జరగనున్నాయని, విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళలో స్టడీ అవర్స్ నిర్వహించి మంచి ఫలితాలు వచ్చేటట్లు చూడాలని హెచ్‌డబ్ల్యూవోలకు తెలిపారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ-1, ఎస్సీ-2 బాలుర వసతిగృహాలు శిథిలావస్థలో ఉన్నాయని త్వరలో నూతన భవనాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలోని వసతి గృహాల మరమ్మతులకు రూ.68 లక్షలు, బాలికల వసతి గృహానికి రూ.9 లక్షలు మంజూరు చేశామని పనులు జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా ఈ మూడు వసతిగృహాలకు డైనింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.52 లక్షలు మంజూరు చేశామన్నారు. జిల్లాలోని 43 వసతి గృహాలకు మౌలిక వసతులు, ఇతర నిర్మాణ పనుల కోసం రూ.19.16 కోట్లతో నివేదికలు పంపించామని ప్రస్తుతం 13.19 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. విద్యార్థులకు మౌలిక వసతుల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని ఆయన తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గంపల వెంకటరహణ, హెచ్‌డబ్ల్యూవోలు రమేష్‌బాబు, శ్రీనివాసులు, సావిత్రి విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్టే?

- పర్సన్ ఇన్‌చార్జ్‌ల గడువు ఆరు నెలలు పొడిగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


కలికిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలకు ఎన్నికలు సమీప కాలంలో జరిగే అవకాశాలు లేనట్టేనని గురువారం ప్రభుత్వం విడుదల చేసిన జీవో ద్వారా తెలుస్తోంది. అంతేగాకుండా నామినేటెడ్ పాలకవర్గాల నియామకాలు కూడా వాయిదా పడ్డట్టేనని చెబుతున్నారు. అన్ని రకాల సహకార సంఘాలకు ప్రస్తుతం అధికారులతో పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ పర్సన్ ఇన్‌చార్జ్‌ల గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న అధికారుల పదవీ కాలాన్ని ఈనెల 21వ తేదీ నుంచి మరో ఆరు నెలలపాటు పొడిగించారు. ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్)తో పాటు, రైతు సేవా సహకార సంఘాలు (ఫార్మర్స్ సర్వీసు కో-ఆపరేటివ్ సొసైటీస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, జిల్లా మార్కెటింగ్ సొసైటీలు, ప్రింటింగ్ ప్రెస్, వినియోగదారుల సహకార సంఘాలులాంటి లార్జ్‌డ్ సైజ్ కో-ఆపరేటివ్ సొసైటీలన్నింటికీ ఈ పొడిగింపు ఉత్తర్వులు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. వివిధ రకాల సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నట్లు ప్రచారం జరిగింది. లేదంటే గతంలో వలే ముగ్గురు సభ్యులతో కూడిన త్రీమెన్ కమిటీలను నామినేట్ చేయడానికి మరో వైపు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లుగా కూడా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో దిగువస్థాయి అధికార పార్టీ శ్రేణులు త్రీమెన్ కమిటీల ద్వారా నామినేట్ కావడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఒకవేళ నామినేటెడ్ త్రీమెన్ కమిటీలు కాకుండా సహకార సంఘాలకు నేరుగా ఎన్నికలు జరిపినా ఎదుర్కొనేందుకు కూడా కూటమి పార్టీల నాయకులు సిద్ధంగా ఉన్నారని చెబుతున్నారు. ఈ దశలో అధికారులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా మరో ఆరు నెలలపాటు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో రాజకీయ వర్గాల్లో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.



యురేనియం నిల్వలు

- పింఛా, కాటిమాయకుంట ప్రాంతాల్లో గుర్తించిన కేంద్ర ప్రభుత్వం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అణు రియాక్టర్లకు ప్రధాన ఇందనం.. అణ్వాయుధాలకు ప్రధాన ముడిసరుకు అయిన యురేనియం నిల్వలు పెద్ద ఎత్తున అన్నమయ్య జిల్లాలో ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. జిల్లాలోని రాయచోటి మండలం కాటిమాయకుంట-మాధవరం గ్రామాల పరిధిలో, సుండుపల్లె మండలం పింఛా పరిధిలో ఈ నిల్వలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అణు ఇందన శాఖ గుర్తించింది. మన దేశ అణు అవసరాలకు తగ్గట్టుగా.. అవసరమైన యురేనియం నిల్వలు ఎక్కడెక్కడ ఉన్నాయి.? వాటిని వెలికితీయడానికి తీసుకున్న చర్యలు? అనే అంశాలపై గత ఏడాది డిసెంబరు 14న రాజ్యసభలో రాజ్యసభ సభ్యులు సంత్ బల్బీర్ సింగ్ ప్రశ్న అడిగారు. దీనికి సమాధానంగా అప్పటి కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ బదులిస్తూ.. దేశంలోని 13 రాష్ట్రాలలో నిల్వలను గుర్తించినట్లు వివరించారు. మన రాష్ట్రంలోని కడప, అన్నమయ్య, కర్నూలు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో యురేనియం నిల్వలు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో రాయచోటి మండలం కాటిమాయకుంట-మాధవరం సెక్టార్‌లో ఈ నిల్వలు ఉన్నట్లు తెలిపారు. కాటిమాయకుంట గ్రామంలో సుమారు 14పల్లెలు ఉన్నాయి. కాటిమాయకుంట పరిధిలో ప్రధానంగా కాటిమాయకుంట, గుంటిమడుగు, బొట్లచెరువు ఊర్లు ఉన్నాయి. వీటి పరిధిలో చూస్తే కాటిమాయకుంటలో అడ్డారివాండ్లపల్లె, హరిజనవాడ, కురవపల్లె, దండువాండ్లపల్లె, గుంటిమడుగు పరిధిలో ఎగువ వడ్డెపల్లె, దిగువవడ్డెపల్లె, నల్లగుండ్లపల్లె, తురకపల్లె, హరిజనవాడ, బొట్లచెరువు పరిధిలో నగిరిమడుగువాండ్లపల్లెలు ఉన్నాయి. అదేవిధంగా సుండుపల్లె మండలం పింఛా గ్రామంలోనూ ఈ నిల్వలు ఉన్నాయి. స్ట్రక్చరల్ కంట్రోల్డ్ గ్రానైట్ యురేనియం నిల్వలు ఈ ప్రాంతంలో పుష్కలంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటికైతే యురేనియం నిల్వలు ఉనట్లు గుర్తించారు. ఈ యురేనియం వెలికితీసేందుకు. శుద్ధి కర్మాగారాలు ఏర్పాటు చేస్తారా... లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఈ విషయం ప్రస్తుతం వెలుగులోకి రావడంతో ఈ ప్రాంతంలో ఒక్కసారిగా చర్చనీయాంశమైంది.



కాటిమాయకుంట గ్రామం

పీటీ వారెంట్‌పై కడప కోర్టుకు వర్రా

- విచారణ 23కు వాయిదా

కడప రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి గురువారం ఎస్సీ, ఎస్టీ కోర్టు(జిల్లా నాల్గవ అదనపు కోర్టు)లో హాజరుపరిచారు. సోషల్ మీడియా లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో రాజంపేట మన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఈయనపై కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసులు వర్రాను తీసుకొచ్చి జిల్లా నాల్గవ అదనపు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి వెంకటేశ్వరరావు ఎదుట హాజరుపరచగా తదుపరి విచారణను 23వ తేదీకి వాయిదా వేశారు.



జడ్జి బంగ్లాలో శ్రీగంధం చెట్ల నరికివేత

వివరాలు... 6 లో..

ఆటోకు డ్వాక్రా రుణం ఇస్తాం

- డీఆర్‌డీఏ ఏపీఎం రాధిక

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కొండాపురం మండలంలోని గండ్లూరు ఎస్టీ కాలనీ వాసి ఆటో గంగమ్మకు ఆటో కొనుక్కునేందుకు రుణం ఇస్తామని డీఆర్‌డీఏ ఏపీఎం రాధిక తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బతుకు భారమై ఆటో నడుపుతూ' కథనంపై విశేష స్పందన లభిస్తోంది. త్వరలో గంగమ్మను కలుస్తానని మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేయడంతో అధికారులు మరింత అలర్ట్ అయ్యారు. సెర్ప్ అధికారుల ఆదేశాలతో ఏపీఎం రాధిక గురువారం గండ్లూరు ఎస్టీ కాలనీలోని గంగమ్మ ఇంటికి వచ్చారు. ఆటో కొనుక్కోవడానికి డౌన్‌పేమెంట్ 10 శాతం చెల్లించాల్సి ఉండగా గంగమ్మ గిరిజన మహిళ కాబట్టి 5 శాతం డౌన్‌పేమెంట్ చెల్లిస్తే రుణం మంజూరు చేయిస్తామని ఏపీఎం తెలిపారు. వడ్డీ లేకుండా కంతుల వారీగా ఆటోకు రుణం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కంతు నెలకు సుమారు రూ.5 వేలు కట్టాల్సి వస్తుందని అయితే తనకు ఆటో ద్వారా అంత సంపాదన లేదని గంగమ్మ ఏపీఎంకు వివరించారు. తాము తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని ప్రభుత్వం ఉచితంగా ఆటో ఇవ్వాలని గంగమ్మ విన్నవించారు. ఒకవేళ వీలుకాకపోతే సబ్సిడీ ద్వారా అయినా ఇవ్వాలని గంగమ్మ కోరారు.



ఆటోగంగమ్మ వివరాలు సేకరిస్తున్న డీఆర్‌డీఏ ఏపీఎం రాధిక

పంచాయతీ సమావేశంలో ఆధిపత్య పోరు

- సమావేశంలోకి టీడీపీ, వైసీపీ నేతలు
- పోలీసు బందోబస్తు మధ్య పాలకవర్గ సమావేశం



పంచాయతీ పాలకవర్గంతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ, వైసీపీ నాయకులు

పీలేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ పంచాయతీలో గురువారం జరిగిన పాలకవర్గ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల ఆధిపత్య పోరుకు వేదికగా నిలిచింది. సాధారణంగా సర్పంచు, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొనాల్సిన సమావేశంలో ఇరు పార్టీల నాయకులు పెద్దఎత్తున పాల్గొనడంతో పీలేరులో ఉద్రిక్తతకు దారి తీసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల బందోబస్తు మధ్య పంచాయతీ సమావేశం నిర్వహించాల్సి వచ్చింది. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల మంజూరుకు నిర్వహించే సమావేశం కాస్తా రసాభాసగా ముగిసింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన తరువాత కూటమి నేతలు పీలేరు పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించారు. గత వైసీపీ పాలనలో పంచాయతీలో నిధుల దుర్వినియోగం అయినట్లు నిర్ధారణ కావడంతో సర్పంచ్ హబీబ్‌బాషా చెక్ పవర్ రద్దు చేయడమే కాకుండా నిధులు డ్రా చేసే అధికారం పంచాయతీ కార్యదర్శి గురుమోహన్‌తో పాటు పీలేరు ఎంపీడీవోకు అప్పగించారు. అప్పటి నుంచి సర్పంచ్, కార్యదర్శి మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఇరువురికీ ఇరు పార్టీల మద్దతు ఉండడంతో మూడు నెలలుగా ఎవరికివారు తమ ధోరణిలో పంచాయతీ కార్యాలయంతో పాటు పంచాయతీ వ్యవహారాలలో తమ ఆధిపత్యం ప్రదర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పంచాయతీ పాలకవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో కార్యదర్శిపై ఎదురుదాడి చేయాలని వైసీపీ మద్దతుదారులైన సర్పంచుతో పాటు వార్డు సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన స్థానిక టీడీపీ నేతలు కార్యదర్శికి మద్దతుగా పెద్దఎత్తున పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. పంచాయతీ వ్యవహారాలలో కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సర్పంచుతో పాటు తమను పట్టించుకోవడం లేదని పలువురు వార్డు సభ్యులు కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శి వ్యవహారశైలి కారణంగా పట్టణంలో పారిశుధ్య, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆరోపించారు. నిబంధనలు, ప్రజల ఫిర్యాదుల ఆధారంగా తాను వ్యవహరిస్తున్నానని కార్యదర్శి జవాబు చెప్పడంతో సమావేశంలో కాసేపు గందరగోళం ఏర్పడింది. చివరకు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ బాలకృష్ణ జోక్యం చేసుకుని సభ్యులను శాంతింపజేశారు. అనంతరం 54 అంశాలతో కూడిన అజెండాను ఆమోదించినట్లు తీర్మానించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమావేశం ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో సీఐడీ విచారణ



తరిగొండలో రైతులను విచారిస్తున్న నెల్లూరు సీఐడీ సీఐ రాజేష్‌కుమార్

గుర్రంకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్స్ దహనం కేసు విషయమై గురువారం నెల్లూరు సీఐడీ సీఐ రాజేష్‌కుమార్ బృందం రైతులను విచారించారు. ఇందులో భాగంగా శెట్టివారిపల్లె, తరిగొండ గ్రామాలకు చెందిన 20 మంది రైతులను విచారించారు. ఈ రైతుల భూములను ఓ మోతుబరి తన పేరిట ఆన్‌లైన్, వన్‌బీ నమూనాలను చేయించుకున్నాడు. ఈ క్రమంలో రైతుల నుంచి భూములను కొనుగోలు చేశాడా...? లేక దౌర్జన్యంగా భూములను లాక్కున్నాడా అనే కోణంలో వివరాలు సేకరించారు. అనంతరం రైతుల నుంచి భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులు అందించిన వివరాలను ఉన్నతాధికారులకు అందచేస్తామని సీఐడీ అధికారులు తెలిపారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- డ్వామా పీడీ వెంకటరత్నం


పెద్దమండ్యం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం సిబ్బందిని ఆదేశించారు. పెద్దమండ్యం మండలంలో గురువారం ఆయన పర్యటించారు. మండలంలోని పెద్దమండ్యం, కొలిమికాడపల్లి, మండ్యం దళితవాడ, కోటకాడపల్లెల్లో ఉపాధి పథకం ద్వారా జరుగుతున్న గోకులం షెడ్లు, వాటర్‌షెడ్ల అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వాటర్‌షెడ్ పథకం ద్వారా జరుగుతున్న పనులపై సిబ్బందితో సమీక్షించారు. భూగర్భజలాలు పెంపొందించడానికి వాటర్‌షెడ్‌లు దోహదపడాలన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా వాటర్‌షెడ్ల నిర్మాణాలు జరగాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణ పనులు ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఎంపీడీవో శ్రీధర్‌రావు, వాటర్‌షెడ్ పీవో రవీంద్రుడు, ఉపాధి ఏపీవో మురళి, వాటర్‌షెడ్ల చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.



మండ్యం దళితవాడలో గోకులం షెడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ఇలా ఉంటే చదువులెలా..?

- కొందరు సమ్మెలో.. మరికొందరు సెలవుల్లో...
- 16 రోజులుగా పాఠశాలకు ఉపాధ్యాయులు దూరం
- ఒకే గదిలో ఆరు తరగతులు
- విద్యకు దూరమవుతున్న గిరిజన విద్యార్థులు



గిరిజన గురుకుల పాఠశాల



ఒకే గదిలో 6 తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టిన దృశ్యం

సుండుపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ బడులకు పంపించి చదివించే స్థోమత లేక ప్రభుత్వ విద్యను నమ్ముకుని తల్లిదండ్రులు చిన్నారులను సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని గిరిజన గురుకులంలో చేర్పించారు. అయితే ఈనెల 4వ తేదీ నుంచి కొంతమంది ఉపాధ్యాయులు జీతాలు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా పాఠశాలకు రావడం లేదు. గురుకులంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 110 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 16 రోజులుగా ఉపాధ్యాయులు రాకపోవడంతో 8 గదుల్లో ఉండి విద్యను అభ్యసించాల్సిన విద్యార్థులు ఒకటి, రెండు తరగతి గదులకే పరిమితమై గుంపుగా కూర్చుని కాలయాపన చేయాల్సి వస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు అడిగితే ఉపాధ్యాయులు స్ట్రైక్‌లో ఉన్నారని చెబుతున్నారు. ఉపాధ్యాయులు స్ట్రైక్‌లో ఉంటే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి.. విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు హామీ ఇస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులను బడికి రప్పించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేలా చూడాలని కోరుతున్నారు.

అంతా మా ఇష్టం...

గిరిజన గురుకులంలో ఉపాధ్యాయుల తీరు అంతా మా ఇష్టం. వస్తే వస్తాం లేదా సెలవు పెడతాము అన్నట్లుగా మారింది. ఆ పాఠశాలకు ఫిజిక్స్ ఉపాధ్యాయుడే లేడు. ఇంగ్లీష్ టీచర్‌ను సుండుపల్లె గిరిజన గురుకులం నుంచి మైదుకూరుకు డిప్యుటేషన్ మీద పంపించినట్లు ప్రిన్సిపాల్ చెబుతున్నారు. ఉద్యోగం చేస్తున్న బడిలో ఉపాధ్యాయులే లేక విద్యార్థులు సతమతమవుతుంటే ఉన్న ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్ మీద పంపించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. గురుకులంలో మొత్తం 7మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అందులో నలుగురు సమ్మెలో ఉండగా ఇద్దరు బుధ, గురువారాలు సెలవు పెట్టారు. ఉపాధ్యాయులు స్ట్రైక్‌లో ఉంటే ఏ విధంగా పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులకు సెలవు మంజూరు చేశారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. క్రాఫ్ట్ పోస్ట్ ఖాళీగా ఉంది. కేవలం ఒకే ఒక తెలుగు ఉపాధ్యాయురాలు మాత్రమే బుధ, గురువారాల్లో పాఠశాలలో ఉన్నారు. ఒక ఉపాధ్యాయురాలితో 8 తరగతుల విద్యార్థులకు రోజు మొత్తం ఏ విధంగా విద్యను అందిస్తారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయురాలిగా స్టాఫ్ నర్సు

పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో గురుకులంలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ఓ మహిళ ఉపాధ్యాయురాలి అవతారమెత్తింది. ఓ తరగతి గదిలో 7వ తరగతి, 9వ తరగతి విద్యార్థులను కూర్చోబెట్టుకొని చదివిస్తోంది. ఓవైపు విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. మరోవైపు విద్యార్థులు ఆడుకుంటున్నారు. విద్యార్థుల జీవితాలతో ఉపాధ్యాయులు చెలగాటమాడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఊరికి దూరంగా బడి ఉంది కదా ఎవరూ రారులే అన్న ధీమాతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేలా చూడాలని కోరుతున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు ఏమయ్యాడో..

ప్రభుత్వ బడుల్లో ఆటపాటలతో కూడిన మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిరంతరం ప్రకటనల ద్వారా సందేశాన్ని అందిస్తున్నారు. అయితే గిరిజన గురుకులంలో మాత్రం వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలందించాల్సిన ఉపాధ్యాయుడు ఏమయ్యాడో మాకు తెలియదని విద్యార్థులు చెబుతున్నారు. గురుకుల పాఠశాలల్లో చదువుతూ క్రీడల ద్వారా ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేయాల్సిన ఉపాధ్యాయుడు దసరా సెలవుల నుంచి రావడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. అంతేగాకుండా విద్యార్థుల్లో కొంతమంది కబడ్డీ ఇతర ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారు ఉన్నారు. అలాంటి వారికి శిక్షణ ఇచ్చేందుకు ఎవరూ లేకపోవడంతో హాస్టల్‌కు పరిమితమై ఉన్నామని చెబుతున్నారు. చదువుతో పాటు ఆటల్లో రాణించిన వారికి కూడా ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. విద్యార్థులకు ఆటల పోటీలే నిర్వహించకపోతే ఎలా గుర్తింపు లభిస్తుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

సమస్య పరిష్కరిస్తాము..

ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాప్తంగా స్ట్రైక్‌లో ఉన్నారు. ఉన్న ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లడం బాధాకరం. విచారించి సమస్యను పరిష్కరిస్తాము. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేస్తాము.

- సురేశ్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ పర్యవేక్షణ అధికారి



ఉపాధ్యాయురాలి పాత్ర పోషిస్తున్న స్టాఫ్‌నర్స్

కబ్జాదారులు ఉన్నారు జాగ్రత్త...

- భూసమస్యలపై సివిల్ కోర్టులో బాధితులు
- అక్రమాలకు స్వస్తి పలికేది ఎన్నడు
- జిల్లాలో ఆగని భూఅక్రమాలు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో జేబు దొంగలున్నారు జాగ్రత్త అని పోలీసులు బోర్డులు పెట్టేవారు. అందులో కొంత మంది ఫొటోలు కూడా అతికించి వీరు దొంగతనాలకు పాల్పడతారు.. మీరు జాగ్రత్తగా ఉండండి అని హెచ్చరిక బోర్డులో ఫొటోలు ఉంచేవారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దొంగతనాలు అరికట్టడం చాలా వరకు సాధ్యమైంది. ఆధునిక సమాజంలో రెండు డిపార్టుమెంట్ల వారు కాస్తా నిర్లక్ష్యం వహిస్తే సమాజం భ్రష్టు పట్టిపోతుంది అనే వాదన కూడా లేకపోలేదు. అందులో ఒకటి పోలీస్, రెండు రెవెన్యూగా చెప్పవచ్చు. పోలీసులు ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ ఉపయోగించి దొంగతనాలు జరగకుండా అరికట్టగలుగుతున్నారు. రెవెన్యూ వారు మాత్రం భూకబ్జాల నుంచి ప్రజలను కాపాడలేకపోతున్నారనే విమర్శలున్నాయి. గ్రామాల్లో వీఆర్‌వోల పాత్ర కీలకంగా ఉండడంతో ప్రతి గ్రామంలోనూ అసైన్డ్ భూములు, ఎండోమెంట్ భూములు, గ్రామ కంఠాలు, వంకలు, వాగులు, చెరువులు ఆన్‌లైన్ చేసి కొంత వసూలు చేస్తున్నారని ప్రచారం ఉండేది. గత ప్రభుత్వంలో అన్నీ పూర్తి చేసేశారో ఏమో ఇప్పుడు గ్రామంలో ఎవరైతే లేరో వారి భూములు అవలీలగా వన్‌బీ, అడంగల్ ఎక్కించి అందినంత పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో దాదాపు 75 శాతం అర్జీలు అన్నీ కూడా భూకబ్జాలకు గురయ్యాయని అధికారుల దగ్గర లెక్కలు ఉన్నాయి. గతంలో జరిగిన భూఅక్రమాలకు పరిష్కారం దొరకక కొంతమంది బాధితులు సివిల్ కోర్టు తలుపు తడుతున్నారు. జిల్లాలో రాజంపేట, మదనపల్లె డివిజన్లలో ఎక్కువగా భూఅక్రమాలు గతంలో జరిగాయని, వీటికి పరిష్కారం కోసం తహసీల్దార్ల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వారు జేసీ కోర్టు, ఆర్డీవో కోర్టుకు వచ్చామని చెబుతున్నారు. 2019-24 వరకు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా భూఅక్రమాలు జరిగాయని, జిల్లా అధికారులు ఒక అంచనాకు వచ్చారు. రికార్డు పరంగా అన్ని ఆధారాలు ఉన్న బాధితుల కోసం పరిష్కారం వెతుకుతూ ఒక్కొక్క కేసును డిస్పోజల్ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రికార్డ్స్ ఆధారంగా పూర్తిగా పరిశీలన చేసి కేసును త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రాయచోటి మండలం శిబ్యాల గ్రామానికి చెందిన దళితుల భూమిని కొందరు ఆక్రమించారని వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొంతమంది ఆర్డీవో కోర్టులో పిటిషన్ వేసుకొని అక్కడ సరైన ఆధారాలు లేకపోవడంతో ప్రత్యర్థులపై మళ్లీ జేసీ కోర్టుకు కూడా వెళుతున్న పరిస్థితులు ఇక్కడ చాలా ఉన్నాయి. ఏదైనా భూమిని ఆక్రమించాలంటే ముందు తప్పుడు రికార్డ్స్ సృష్టించి ఆ తర్వాత పొలం మీదికి వెళ్లే పరిస్థితులు గతంలో ఎక్కువగా జరిగాయని రిటైర్డ్ తహసీల్దార్లు చెబుతున్నారు. ఈ విషయంపై డీఆర్వో మధుసూదన్‌రావును వివరణ కోరగా... మదనపల్లి, రాజంపేట డివిజన్లలో ఎక్కువ అక్రమాలు జరిగాయని, మేము ఒక అంచనాకొచ్చాము. అయితే ఆర్‌వోఆర్ కోర్టులో వేసుకున్న ప్రతి బాధితునికి న్యాయం చేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాము. పూర్తి రికార్డు పరిశీలన చేసిన తర్వాతే తదుపరి ఆర్డర్స్ ఇస్తున్నాం.



రాయచోటి మండలం శిబ్యాల గ్రామంలో తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు (ఫైల్)

కేసులు నమోదు చేయాలి



పేదల భూములు ఆక్రమించి తప్పుడు రికార్డులు సృష్టించే వారిని రెవెన్యూ, పోలీసు వారు గుర్తించి కేసులు నమోదు చేస్తే కొంతవరకు భూఅక్రమాలకు కళ్లెం వేయొచ్చని మా అభిప్రాయం. రెండు ఎకరాలు భూమి గల పేదవాడు పొట్టకూటి కోసమై పట్టణానికి వెళితే ఆ భూమిని ఆ గ్రామంలో ఉన్న వారు కబ్జాలకు పాల్పడుతుంటే రెవెన్యూ వారికి తెలియకుండానే ఇదంతా జరుగుతోందా అని మేము ప్రశ్నిస్తున్నాం. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టలేదనేది సామెత. అలాగే రెవెన్యూ వారి సహకారం లేకుండానే జిల్లాలో భూఅక్రమాలు జరుగుతున్నాయా అని మేము జిల్లా అధికారులను అడుగుతున్నాం. ఎక్కడైతే భూఆక్రమణలు జరిగాయో ఆ గ్రామానికి సంబంధించిన వీఆర్‌వోలను తక్షణం సస్పెండ్ చేసి విచారణలో అవసరమైతే తహసీల్దార్‌ను కూడా సస్పెండ్ చేస్తే తప్ప భూఅక్రమాలకు కళ్లెం వేయలేం.

- జి.ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

రామానాయుడి చెరువు చుట్టూ ట్రెంచ్ తీసిన పోలీసులు



రామానాయునిచెరువు చుట్టూ ట్రెంచ్ తీస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురుల అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి రెవెన్యూ, పోలీస్ అధికారులు రామానాయునిచెరువు చుట్టూ గురువారం ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ కొట్టించారు. ఈ చెరువులో కొన్ని నెలలుగా ఇసుక వ్యాపారులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై పత్రికలో పలుమార్లు వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో జిల్లా అధికారులు ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ క్రమంలో రామానాయునిచెరువు చుట్టూ గురువారం ఎక్స్‌కవేటర్ సాయంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో ట్రెంచ్ తీయించారు. ఇసుక ట్రాక్టర్లు చెరువులోకి ప్రవేశించే మార్గాలను మూసేశారు. ఈ క్రమంలో సుమారు 10 అడుగుల లోతు వరకు ట్రెంచ్‌ను కొట్టించారు. ఈ ట్రెంచ్ దాటుకుని చెరువులోకి ఇసుక ట్రాక్టర్లు ప్రవేశిస్తే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే ప్రతిరోజు రెవెన్యూ సిబ్బంది అక్రమ ఇసుక రవాణాపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.

కళాశాలలో భద్రత కట్టుదిట్టం చేయండి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌బాబు

వాల్మీకిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ఏపీ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ రమామంజులతో మాట్లాడుతూ కళాశాల ఆవరణలో సీసీ కెమెరాలను పూర్తి స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. బాలికల హైస్కూల్, కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండటం తో ఇరు యాజమాన్యాలు బాధ్యతగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి ముఖద్వారం వద్ద కూడా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అనుమానిత వ్యక్తులు కళాశాల పరిసరాలలో కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గత ఆదివారం రాత్రి కళాశాలలో ఆకతాయిల ప్రవర్తన పట్ల ఆ ప్రాంతంలో రాత్రి గస్తీ కూడా పెట్టామని తెలిపారు. కళాశాలలో సమస్యల పరిష్కారం విషయమై స్థానిక ఎంపీడీవో మనోహరరాజు, ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్‌లు పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్జి బంగ్లాలో శ్రీగంధం చెట్ల నరికివేత



గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన శ్రీగంధం చెట్లు, పరిశీలిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని కదిరి రోడ్డులో గల బంగ్లాలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు శ్రీగంధం చెట్లను నరికివేసి మొదళ్లను తీసుకెళ్లిపోయారు. ఉదయం గమనించిన జడ్జి బంగ్లా అటెండర్ మునివెంకట్ గురువారం వన్‌టౌన్ సీఐ ఎరిసావలికి ఫిర్యాదు చేశారు. వెంటనే మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, ఎస్ఐ వెంకటశివ కుమార్ జడ్జి బంగ్లాకు చేరుకుని చెట్ల నరికివేతను పరిశీలించారు. అనంతరం అటెండర్ ముని వెంకట్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగం

- పనులు చేయకుండానే బిల్లులు
- రికార్డులు పరిశీలించిన డీఎల్‌పీవో



నిధుల దుర్వినియోగంపై విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో

సుండుపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వమంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మండల అభివృద్ధి నిధుల నుంచి గ్రామ పంచాయతీ నిధుల వరకు ఏ గ్రామంలో చూసినా లక్షలు భోంచేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు వైసీపీ నాయకులు, వైసీపీ మద్దతుదారులైన ప్రజాప్రతినిధుల జేబులు నింపుకునేందుకు అన్నట్లుగా ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేశారు అనడంతో ఎటువంటి సందేహం లేదు. అలాంటిదే మండలంలోని ఒక చిన్న గ్రామ పంచాయతీ అయిన చిన్నగొల్లపల్లె. ఆ గ్రామంలో సుమారు రూ.40 లక్షల నిధుల దుర్వినియోగమయ్యాయని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య కొన్ని రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా గురువారం చిన్నగొల్లపల్లె సచివాలయంలో నిధుల దుర్వినియోగంపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజంపేట డీఎల్‌పీవో మస్తాన్‌వలీ విచారణ నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు చిన్నగొల్లపల్లె పంచాయతీకి చెందిన పంచాయతీ నిధులు, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో రికార్డులను తనిఖీ చేశారు. కొన్ని ఎం-బుక్కులు రికార్డు చేశారు. మరికొన్ని బిల్లుల రూపంలో పెట్టి డ్రా చేసినట్లు రికార్డుల పరిశీలనతో తేలిందని డీఎల్‌పీవో మస్తాన్‌వలీ తెలిపారు. సమగ్రంగా విచారించి శుక్రవారం పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. అప్పయ్యగారిపల్లెకు సీసీ రోడ్డు వేయకుండానే వేసినట్లు రూ.1.74 లక్షల నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పెద్దమొత్తంలో పనులు చేయకుండానే డబ్బులు డ్రా చేసి ఇష్టారాజ్యంగా వాడుకున్నారని, రెండు సంవత్సరాల వ్యవధిలో జరిగిన పనులను పల్లెల్లోకి వెళ్లి సమగ్రంగా విచారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌ఆర్‌డీ సురేశ్ బాబు, సర్పంచ్ జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి వైసీపీ నేతల డుమ్మా

- బి.కొత్తకోట మండలమీట్ వాయిదా..
- మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్న కూటమి శ్రేణులు



మండల పరిషత్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు

బి.కొత్తకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సర్క్యులర్ పంపారు. అయితే మండలంలోని 11 మంది ఎంపీటీసీ సభ్యులు, 15 మంది సర్పంచులలో ఏ ఒక్కరూ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో గంటపాటు వేచి చూసి సమావేశాన్ని నిర్వహించేందుకు అవసరమైన కోరం లేకపోవడంతో మండలమీట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శంకరయ్య మధ్యాహ్నం 12 గంటలకు ప్రకటించారు. సెప్టెంబరు 20న జరగాల్సిన సమావేశం కూడా కోరంలేక రద్దు అయిన నేపథ్యంలో ఈనెల 19న జరపాలని భావించారు. అయితే ఎంపీపీ లక్ష్మీనరసమ్మ సహా సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో వాయిదా వేశారు. ఈ విషయమై కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు నివేదిక సమర్పించినట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా గత సమావేశం రోజున కూటమి నాయకులు మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుని ప్రస్తుతం ఉన్న సభ్యులెవరూ ప్రజలచేత ఎన్నిక కాకుండా ఎవరో సెలెక్ట్ చేస్తే అక్రమమార్గంలో వచ్చారని, వారందరూ రాజీనామా చేసి ఎన్నికల్లో గెలిచి రావాలంటూ అడ్డు తగిలారు. అలాగే గురువారం కూడా అదే సీన్ రిపీట్ అయింది. కార్యాలయం వద్దకు కూటమి నాయకులు భారీగా చేరుకున్నారు. సీఐ జీవన్‌గంగాధర్ బాబు పర్యవేక్షణలో పోలీసులు కూటమి నాయకులను లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో వీరు గేటు వద్దే గుమికూడి సెలెక్టెడ్ వైసీపీ సభ్యులను రానివ్వబోమని నినాదాలు చేస్తూ అక్కడే వేచి ఉన్నారు. ఎట్టకేలకు సమావేశం వాయిదా పడటంతో హాజరైన మండలస్థాయి అధికారులతో సహా అందరూ తిరుగుముఖం పట్టారు.

పెన్నపేరూరును తనిఖీ చేసిన ఆర్డీవో



గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో

ఒంటిమిట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల వెనుకజలాల ద్వారా పెన్నపేరూరు గ్రామంలోకి నీరు రావడాన్ని ఆర్డీవో జాన్ ఎర్విన్ దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఏ మేరకు నీరు చేరుతోంది.

సోమశిల బ్యాక్‌వాటర్ పరిధి ఏ మేరకు ఉందనే దానిపై సోమశిల అథారిటీ ద్వారా సమాచారం తెప్పించుకుని పూర్తి నివేదిక తయారు చేయాలని తహసీల్దారు రమణమ్మకు సూచించారు. గ్రామంలోని ప్రజలకు ఇబ్బంది కలగకుండా శానిటేషన్ వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలని నిరంతరం ప్రజలకు సేవలందించాలని ఆయన సూచించారు. ఇళ్లకు పరిహారం ఇవ్వాలని, పరిహారం ఇస్తే ఇక్కడి నుంచి వెళతామని ఆర్డీవోకు స్థానికులు తెలపడంతో దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని ఆయన అన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రెవెన్యూ స్థలాల్లో అక్రమ కట్టడాలు తొలగించేందుకు రెవెన్యూశాఖ ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ స్థలాలు కనపడితే ఆక్రమణదారులు పాగా వేయడం, రాత్రికి రాత్రే కట్టడాలు మితిమీరిపోయి వారికి అడ్డూ అదుపులేకుండా పోయింది.

మండలంలోని పెద్దపల్లె రెవెన్యూ సర్వేనంబరు 641/1 లెటర్ భాకరాపేట గ్రామానికి చెందిన తుర్రా సుబ్బలక్షుమ్మ వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ పెద్దలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ వంక పొరంబోకు స్థలాన్ని 11 సెంట్లు ఆక్రమించి స్థలాన్ని అన్యాక్రాంతం చేశారు. మాధవరం గ్రామం సర్వేనంబరు 864/7 గ్రామ సచివాలయం-2 పరిధిలో గత ప్రభుత్వంలో వంక పొరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవనాలను నిర్మించారు. పలువురు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూశాఖ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపి పూర్తిగా భవనాలు తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం చేసిన వారిపై చర్యలు చేపట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవిలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

చెంగుచెంగున..

అది ఆషామాషా వన్యప్రాణి కాదు.. రామాయణంలో శ్రీరామచంద్ర మూర్తి సీతతో కలిసి వనవాసం వెళ్లిన సమయంలో.. సీతమ్మకు కనువిందు చేసిన ప్రాణి. రామాయణంలో సీతారాముల జీవితం మలుపు తిరగడానికి.. ఒక రకంగా చెప్పాలంటే రావణసంహారానికి కారణం ఇదే వన్యప్రాణి. అయితే రామాయణంలో విన్నది మాయలేడి (జింక) గురించి.. నిజమైన లేడిని చూడాలంటే కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం కళాశాల వెనుకవైపునకు వెళితే చాలు. ఇక్కడ ఈ అందమైన వన్యప్రాణులు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. చెంగుచెంగున ఎగురుతూ కనువిందు చేస్తాయి. అక్కడికి నిత్యం గుంపులుగా వచ్చి మేతమేసి వెళుతున్నాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప











జీవితానికి ఆర్థిక భరోసా... పీఎల్ఐ

● తక్కువ ప్రీమియం...ఎక్కువ బోనస్

● పాలసీల ద్వారా ఉద్యోగుల జీవితాలకు వెలుగులు

కడప మారుతీనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన తపాలా జీవిత బీమా పథకం (పీఎల్ఐ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలకు ఆర్థిక భరోసా నిచ్చేలా దోహదపడుతోంది. 1884 ఫిబ్రవరి 1న కేవలం తపాలాశాఖలో ఉద్యోగం చేసే పురుషుల కోసం ప్రారంభైన పీఎల్ఐ కాలగమనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కార్పొరేషన్ ఉద్యోగులు, గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాలల ఉద్యోగులు, ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ, విద్యనభ్యసించి ప్రయివేటు ఉద్యోగం చేసేవారు. బ్యాంక్ ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, చార్టెడ్ అకౌంటెంట్లు తదితర విభాగాల వారికి వర్తించేలా కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ ఇటీవల జీవో జారిచేసింది.

18 నుంచి 55 సంవత్సరాల లోపు వారు అర్హులు

పీఎల్ఐ స్కీంలో చేరేందుకు 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులు. ఇందులో పాలసీని రూ.20 వేల నుంచి దాదాపు రూ.50 లక్షల వరకు తీసుకునే సౌకర్యముంది. ఇదిలా వుండగా 2017 ఏప్రిల్ 1న వెలువడిన జీవో ప్రకారం పైన తెలిపిన ఉద్యోగులు పీఎల్ఐ పాలసీలు తీసుకునే సౌకర్యాన్ని కేంద్రప్రభుత్వం కల్పించింది. పాలసీలు మూడు విధాలుగా 3 నెలలు, 6 నెలలు, 1 సంవత్సరానికి ఒకసారి కట్టుకునే సౌలభ్యం కల్పించింది. కాగా 6 నెలలకు ఒకసారి కట్టుకునే పాలసీకి 1 శాతం, సంవత్సరం పాలసీకి 2 శాతం డిస్కౌంట్ వర్తించే సౌలభ్యం కలదు. పీఎల్ఐలో ప్రధానంగా 6 రకాల పాలసీలు అమలవుతున్నాయి. వాటిలో సువిధ, సుమంగళి, యుగళ్ సురక్ష, సురక్ష, సంతోష్, బాలజీవన్ బీమా పాలసీలున్నాయి.

సువిధ : ఇందులో హోల్ లైఫ్ పాలసీదారులు 5 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత సంతోష్ పాలసీలోకి మారే వెసులుబాటు కల్పించారు. తక్కువ డబ్బులు కట్టుకునే వీలుతో పాటు రుణం తీసుకునే సౌకర్యం కలదు.

సుమంగళి : ఈ పాలసీని మనీ బ్యాక్ పాలసీ అని కూడా అంటారు. ఈ పాలసీలో 15 సంవత్సరాల పాటు కట్టిన పాలసీదారులు వరుసగా 6 సంవత్సరాలు పూర్తి కాగానే కట్టిన మొత్తం నుంచి 20 శాతం, 9 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, 12 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, చివరగా 15 సంవత్సరాల తర్వాత 40 శాతం డబ్బులతో పాటు అదనపు బోనస్ చెల్లింపు వర్తిస్తుంది. దీంతో పాటు 20 సంవత్సరాల పాలసీల బోనస్‌తో లభిస్తుంది. ప్రధానంగా మధ్యతరగతి ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరం.

యుగళ్ సురక్ష : ఇది జాయింట్ పాలసీ. ప్రీమియం ఒకరు చెల్లించాల్సి వుంటుంది. రిస్క్ కవరేజ్ మాత్రం ఇద్దరికి (భార్యాభర్తలకు) వర్తిస్తుంది. ఈ పాలసీకి సంతోష్ పాలసీ నిబంధనలు వర్తిస్తాయి. ఇందులో 5 నుంచి 20 సంవత్సరాలలోపు వయస్సు గల వారు మాత్రమే అర్హులు. కాగా ఈ పాలసీ కింద రూ.3లక్షల కంటే మించి ఇవ్వరు. తల్లిదండ్రులు ఇద్దరిలో కచ్చితంగా పాలసీ వుంటేనే వర్తిస్తుంది.

సురక్ష : హోల్ లైఫ్ పాలసీ. ఇందులో 19 సంవత్సరాల నుంచి 58 సంవత్సరాల గల వారు పాలసీకి అర్హులు. రూ.20 వేల నుంచి 50 లక్షల వరకు పాలసీ ప్రీమియం. కాగా 4 సంవత్సరాలు కట్టిన తర్వాత రుణం తీసుకునే సౌలభ్యం కలదు. సుమారు 60 సంవత్సరాల పాటు ప్రీమియం కట్టాల్సి వుంటుంది. 80 సంవత్సరాల తర్వాత డబ్బులు తీసుకోవచ్చు. ప్రతి లక్ష రూపాయలకు రూ.7600 బోనస్‌గా సంవత్సరానికి అందుతుంది.

సంతోష్ : ఈపాలసీ తీసుకున్న వారు 3 సంవత్సరాల తర్వాత రుణం తీసుకునే సదుపాయం కలదు. కాగా కట్టిన ప్రీమియం మొత్తం ట్యాక్స్ సేవింగ్ బెనిఫిట్ కింద వెసులుబాటు కలదు. పాలసీ ఆమోదించిన నాటి నుంచి పూర్తి జీవిత రక్షణ వుంటుంది. తపాలా శాఖ ద్వారా తీసుకున్న పాలసీలలో అధిక శాతం (80 శాతం) మంది వినియోగదారులు ఈ సంతోష్ పాలసీవైపే మొగ్గుచూపుతున్నారు.



కడప తపాలా శాఖ ప్రధాన కార్యాలయం

బాలజీవన్ పాలసీ : 5 నుంచి 20 సంవత్సరాల లోపు బాల, బాలికలు అర్హులు. ప్రధానంగా పీఎల్ఐ పాలసీలో వారి తల్లి-దండ్రులు నమోదై వుంటేనే.. బాలజీవన్ పాలసీ వర్తిస్తుంది. ఇందులో రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకూ పాలసీ తీసుకునే సౌకర్యం కలదు.

పీఎల్ఐ పాలసీ ద్వారా మంచి రాబడి



తపాలా శాఖ ద్వారా అందే పీఎల్ఐ పాలసీ ద్వారా మంచి రాబడి అందుతుంది. మిగతా అన్ని ఇన్సూరెన్స్ సంస్థల నుంచి వచ్చే రాబడి కన్నా మెరుగైన ఆదాయం వస్తుంది. అన్ని రకాల ఉద్యోగులు పీఎల్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

-రాజేష్, ప్రధాన తపాలా కార్యాలయ సూపరింటెండెంట్

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రమాదకరం



ధర్నాలో ప్రసంగిస్తున్న 1104 యూనియన్ నాయకుడు

ఎర్రగుంట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆర్టీపీపీలో ఉద్యోగులు గురువారం పవర్‌హౌస్ మెయిన్ గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఉత్తరప్రదేశ్, చండీఘర్‌లోని డిస్కంల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏఐఎఫ్ఈఈ, ఎన్‌సీసీ ఏఈఈఈ పిలుపు మేరకు నిరసన చేపట్టి ఉద్యోగులు నినాదాలు చేశారు. ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటీకరణతో వచ్చే పరిణామాలతో ప్రజలపై మోయలేని విద్యుత్ భారం పడుతుందన్నారు. ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

నాలుగు పంచాయతీలకు తీరనున్న మంచినీటి కష్టాలు

● చిత్రావతి నుంచి రూ.7.3 కోట్లతో మంచినీటి పైపులైను

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు మంచినీటి కష్టాలు తీరనున్నాయి. గత వేసవిలో పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నా, గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే మంచినీటి కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందులో భాగంగా మొదటి విడతగా ప్రాధన్యత క్రమంలో నీటిఎద్దడి ఉన్న పంచాయతీలను అధికారులు గుర్తించారు. కొండాపురం, ఓబన్నపేట, తాళ్లప్రొద్దుటూరు, సుగుమంచిపల్లె పంచాయతీలలో మంచినీటి ఎద్దడిని తీర్చేందుకు ఏటూరు వద్ద నున్న చిత్రావతినది నుంచి పైపు లైను వేయనున్నారు. ఇందుకోసం రూ.7.3 కోట్లతో నాలుగు బ్లాకులుగా టెండర్లు కూడా పిలిచారు. ఇందులో తాళ్లప్రొద్దుటూరు, ఓబన్నపేట పంచాయతీలకు టెండర్లు పూర్తయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కొండాపురం, సుగుమంచిపల్లె పంచాయతీలకు సంబంధించి టెండర్లలో కాంట్రాక్టర్లకు అర్హత లేకపోవడంతో రద్దయినట్టు తెలిపారు. త్వరలోనే వీటికి కూడా తిరిగి టెండర్లు పిలుస్తారని ఏఈ తెలిపారు.

కోదండరామున్ని దర్శించుకున్న రవికుమార్

ఒంటిమిట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామున్ని ఆముదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ చరిత్రను, విశిష్టతను తెలియజేశారు. టీటీడీ అర్చకులు పవన్‌కుమార్, టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లావనూరు వద్ద జరిగింది హత్యేనా?

● పోలీసుల అదుపులో నిందితులు

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు సమీపంలో మంగళవారం అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన సురేష్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. రెండు రోజులుగా కొండాపురం పోలీసులు యల్లనూరులో విచారిస్తున్నారు. యల్లనూరు నుంచి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ కేసులో పోలీసులు ముగ్గురిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా ఒక జీపును కూడా స్వాధీనపరుచుకున్నట్లు సమాచారం. సంఘటన స్థలంలో పడిన మృతదేహం తీరు, పోస్టుమార్టం ఆధారంగా సురేష్‌ది హత్యగానే పోలీసులు భావిస్తున్నారు. కాగా నిందితులను నేడో, ఎల్లుండో అరెస్టు చేసే అవకాశం ఉంది.

పొలం పనిచేస్తూ... మహిళా కూలీ మృతి



పొలం వద్ద మృతి చెందిన మహిళా కూలీ రామక్క

వల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామ పొలంలో గురువారం పొలం పనిచేస్తూ మహిళా కూలీ రామక్క హఠాత్తుగా మృతి చెందింది. తోటి కూలీల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండల పరిధిలోని సీతంపల్లెకు చెందిన ఓ రైతు పెద్దపుత్త గ్రామ పొలాల్లో భూమిని కౌలుకు తీసుకుని దోస తోట సాగు చేశాడు. అందులో కలుపు తీయడానికి తమ గ్రామం నుంచి సుమారు 30 మంది కూలీలను ఆటోల్లో తీసుకుని వచ్చాడు. ఉదయం నుంచి పొలంలో కలుపుతీత పనులు చేస్తుండగా కూలీల్లో ఒకరైన రామక్క మధ్యాహ్నం సుమారు 3.30గంటల సమయంలో ఉన్నట్లుండి కుప్పకూలి స్పృహ తప్పి పడిపోయింది. తోటి కూలీలు ఆమెకు సపర్యలు చేస్తూ 108 వాహనానికి ఫోను చేశారు. వారు వచ్చి పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైరు చోరీ



లింగాల,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదండ్ల గ్రామలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును దొంగిలించారు. విద్యుత్ శాఖ ఏఈ బాలసంజీవులు మాట్లాడుతూ కరెంటు ఉండగానే ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్ లైన్ కట్ చేసి ఒక ఫేజ్ మరొక ఫేజ్‌వైరు టచ్‌కాకుండా తాడుతో కట్టి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపర్ వైరు దొంగిలించారన్నారు. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేయడంతో సుమారు లక్ష రూపాయలు సంస్థకు నష్టం వాటిల్లిందని, ఆ మేరకు లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

పెనుగొండకు కేంద్ర సాహిత్య పురస్కారం అభినందనీయం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మినారాయణను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడం అభినందనీయమని కడప జిల్లా అరసం అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెనుగొండ లక్ష్మీనారాయణ కవిగా రచయితగా విమర్శకుడిగా న్యాయవాదిగా బహుముఖ కోణాల్లో సామాజిక సేవ చేశారన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ జాతీయ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించారని, ఇతర రాష్ట్రాల రచయితలకు తెలుగువారి గొప్పదనాన్ని తెలియజేశారన్నారు. భారతదేశంలో సామాజిక కల్లోలాలు ఏర్పడిన ప్రతి సందర్భంలోను సాహిత్యకారులను ఏకం చేస్తూ రచనల ద్వారా జనాన్ని చైతన్య పరుస్తున్నారని తెలిపారు. పెనుగొండ రాసిన దీపిక అనే విమర్శ గ్రంథానికి పురస్కారం లభించిందని, ఆయన రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర భావి పరిశోధకులకు ఒక నమూన గ్రంథంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రతి జిల్లా నుంచి ఇలాంటి చరిత్రలు రావడానికి ఇది ప్రేరణ ఇచ్చిందని తెలిపారు. అరసం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పెనుగొండకు పురస్కారం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా ధరించాలి

● అర్బన్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి

● రాయచోటిలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

రాయచోటిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని ద్విచక్ర వాహనదారులకు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ కృష్ణమోహన్ నేతృత్వంలో గురువారం రాయచోటిలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని అర్బన్ సీఐ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈర్యాలీ స్థానిక శివాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. లక్షలాది రూపాయలు వ్యయం చేసి బైక్‌లు కొన్న వారు హెల్మెట్ వాడకపోవడంతో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం వల్లనే అధికంగా మృత్యువాతపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేని పక్షంలో పోలీసు చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ ర్యాలీలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు, శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఐ చంద్రశేఖర్

ఇంధన పొదుపుతో భవిష్యత్తులో వెలుగులు

చెన్నూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వాడే ఇంధనాన్ని ముందు జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలని తద్వారా భవిష్యత్తులో వెలుగులు చూడవచ్చని ట్రాన్స్‌కో ఈఈ హరిసేవియానాయక్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు భవిష్యత్తులో ఇంధన అవసరాలు గుర్తించాలన్నారు. రాబోవు కాలంలో బొగ్గు నిల్వలు తగ్గుతాయని. అలాంటప్పుడు ఇంధన కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. సౌరశక్తిని ఎక్కువగా వాడే విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నా రు. విద్యార్థులు తమ కుటుంబాల్లో తల్లిదండ్రులకు ఇంధన పొదుపు గురించి చెప్పడంతో పాటు సౌరశక్తి వాడడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. అంతేకాక ఆఫీసులు, కళాశాలలు, పాఠశాలలు, పరిశ్రమలు లాంటి చోట వారి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఫ్యాన్లు, లైట్లు, స్విచ్ఛాఫ్ చేయాలన్నారు. అనవసరంగా ఫ్రిజ్‌లు తెరిచిమూయడం, నాశిరకం బల్బులు వాడడం, రైతులు మోటర్లను ఆటోమేటిక్ ఏర్పాటు చేసుకోవడం లాంటి వాటి వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఇంధన పొదుపుపై రాత పరీక్ష నిర్వహిం చి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పోస్టర్లను కూడా విడుదల చేశారు. ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రామలింగారెడ్డి, సబ్ ఇంజనీరు స్రవంతి, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ట్రాన్స్‌కో ఈఈ హరిసేవియానాయక్

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ భారతజాతి ముద్దుబిడ్డ, బహుజనుల ఆశాజ్యోతి అయిన అంబేడ్కర్‌ను తలుచుకుంటే ఏమొస్తుంది అంటూ వ్యాఖ్యానించిన అమిత్‌షాను తక్షణం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి, భారతజాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ,జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, ఎం.వి.సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, కే.సి.బాదుల్లా, ఇమ్మానియేల్, కె.మునయ్య తదితరులు పాల్గొన్నారు.



కడపలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న డీహెచ్‌పీఎస్, సీపీఐ సభ్యులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...: అంబేడ్కర్‌పై కేంద్ర హంశాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గమని, వెంటనే పదవికి రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్‌డీ విజయజ్యోతి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అఫ్జల్‌ఖాన్, అలీఖాన్, బండిజకరయ్య తదితరులు పాల్గొన్నారు

రాయచోటిలో...: అంబేడ్కర్‌ను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం వారు రాయచోటి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యంగ రూపశిల్పి అయిన డాబీఆర్ అంబేడ్కర్ గురించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు భారతజాతిని అవమానించినట్టేనన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, రామాంజనేయులు, విశ్వనాథ నాయక్, పల్లం తాతయ్య, సాంబశివ, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యో... ఎంత కష్టం



● కంపచెట్ల పాలైన పసికందు

జమ్మలమడుగు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'ఆ తల్లికి ఎంత కష్టం వచ్చిందో తెలియదు. ఎవరు చేసిన పాప ఫలితమో అంతుచిక్కడంలేదు. గజగజమని చలి వణికిస్తున్నా అభం, శుభం తెలియని పసికందును కంపచెట్లలో పడేసి వెళ్లారు. వివరాల్లో కెళితే... స్థానిక ముద్దనూరు రోడ్డులోని ఎత్తపువారి కాలనీ రోడ్డు పక్కన గనిగుంతల కంపచెట్లలో ఒక రోజు వయసున్న బిడ్డను కంపచెట్లలో పడేసి వెళ్లారు. ఎప్పుడు పడేశారో తెలియదు కాని గురువారం వేకువజామున బహిర్భూమికి వెళ్లిన లూకా అనే వ్యక్తికి ఏడుపు వినిపించడంతో.. ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా.. రోజు వయసున్న పసికందు కనిపించింది. అప్పటికే శరీరానికి చీమలు ఎక్కి శరీరమంతా తిరుగాడుతున్నాయి. వెంటనే ఆయన పసికందును చేతికి తీసుకుని చీమలను తొలగించి నీటితో శుభ్రం చేశాడు. ఈసమాచారాన్ని పోలీసులకు చేరవేశాడు. ఈవిషయం తెలియడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మనిషికో మాట మాట్లాడుతూ వెళుతున్నారు తప్ప బిడ్డ ఆలనా పాలనపై ఎవరూ నోరెత్తడం లేదు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు పసికందును స్థానిక అంగన్వాడీ కేంద్రానికి అప్పగించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. రోజు వయసున్న పసికందు ఆరోగ్యంగానే వున్నట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయితే పసికందును సంరక్షించాలంటే కడప చైల్డ్ ప్రొటక్షన్ హోమ్‌కు తరలించాలని నిర్ణయించారు. ఆమేరకు కడప చైల్డ్ హోమ్ వారికి సమాచారం అందించి అక్కడికి తరలించారు. పోలీసులు, అంగన్వాడీ పర్యవేక్షణలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై అర్బన్ సీఐ లింగప్ప ఎస్ఐ రామకృష్ణ ఆరా తీస్తున్నారు.



అంగన్వాడీ, మహిళా పోలీసు పర్యవేక్షణలో పసికందు

బిల్లు మన హక్కు: మడితాటి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నరసింహారెడ్డి

సంబేపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుడా మేల్కో ప్రతి వస్తువు కొనుగోలుపై బిల్లు అడగడం మన హక్కని సంబేపల్లె జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ కంజుమర్, ప్రొటక్షన్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్న వస్తువు నుంచి పెద్ద వస్తువు వరకు బిల్లులు తీసుకోవాలన్నారు. అనంతరం రాయలసీమ జోన్‌అధ్యక్షుడు దర్బార్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రారెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు తిరుపాల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పవన్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఓబులరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఏడీ

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని డిప్యూటీ ఇంజనీర్ నాగమునిస్వామి పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాలల్లో భాగంగా గురువారం స్థానిక నలంద స్కూల్‌లో విద్యుత్‌వినియోగం పొదుపు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ చాలా విలువైందని, కరెంట్‌తో పనిచేసే వాటర్ హీటర్లు, గీజర్ల వాడకం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈలు హరినాథ, యుగంధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం, విద్యుత్‌శాఖ సిబ్బంది బాబ్‌జాన్, మల్లికార్జున, వేణుగోపాల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ క్షేత్రస్థాయిలో పరిశీలన


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏవో చంద్రా నాయక్

చిన్నమండెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో ఈ-క్రాప్ నమోదును జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) చంద్రానాయక్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను రైతులు ఈ-పంట యాప్‌లో నమోదు చేసుకోవాలని ఆయన తెలియజేశారు. అలాగే ఈ-పంట నమోదుతో పాటు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు అర్హులవుతారని తెలిపారు. తప్పనిసరిగా పంట పెట్టిన ప్రతి రైతూ ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో గీత, ఏఈవో అనూష, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీలపై దాడి హేయమైన చర్య

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

రాజంపేటటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ప్రాంగణంలో బీజేపీ ఎంపీలపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దాడిచేయడం హేయమైన చర్య అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. గురువారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ప్రధానద్వారం వద్ద ప్రతిపక్ష పార్టీలు నినాదాలు చేస్తున్న క్రమంలో బీజేపీ ఎంపీలను ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ దాడి చేయడం తగదన్నారు. రాహుల్‌గాంధీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాపయ్య, వీవీ రమణ, పెనుగొండ రమణ, శ్రీనివాసులు, రాయల్ కిరణ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

గుర్రంకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):దుకాణాలు, ఇళ్లలో మనుషులు లేనిసమయంలో చోరీలకు పాల్పడుతున్న దొంగకు స్థానికులు దేహ శుద్ధి చేసిన సంఘటన గుర్రంకొండ కొత్తపేటలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు పెద్దమండ్యం మండలం కలిచెర్ల పంచాయతీ వడ్డిప ల్లెకు చెందిన రెడ్డెప్ప గుర్రంకొండ పట్టణంలో గతంలో పలు దుకా ణాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో గురువారం ఓ వెల్డింగ్ షాపులో యజమాని లేని సమయంలో ఇనుప వస్తువులను చోరీ చేస్తుండగా పట్టుకుని అక్కడే కట్టేసి దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు అప్పగించారు.

రైల్వేకోడూరులో మంచు దుప్పటి


పంట పొలాలను కప్పేసిన మంచు

రైల్వేకోడూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలో విపరీతంగా మంచు కురుస్తోంది. సాయంత్రం 5 గంటలకే చలి గాలి మొదలవుతోంది. రాత్రి 7 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మంచు తగ్గడం లేదు. రైల్వేకోడూరుకు తమిళనాడు, నెల్లూరు ప్రాంతాలు దగ్గరలో ఉండడంతో అల్పపీడనాలు వచ్చినప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భూమిలో తేమ శాతం అధికమై మంచు ప్రభావం చూపుతోంది. తద్వారా చలితీవ్రత పెరగడంతో వృద్ధులు చలికి తట్టుకోలేకున్నారు.


తీవ్ర మంచులో వెళుతున్న వృద్ధురాలు

గ్రామీణ ప్రాంతాల్లో చలిమంటలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మరింత చలి, మంచు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

సమస్యలు గుర్తించనప్పుడు రావడం ఎందుకు ?

● తహసీల్దారుపై కడప ఆర్డీవో ఆగ్రహం

ఒంటిమిట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని మ్యాప్‌ను, సమస్యలను తెలుసుకోకుండా రెవెన్యూ సదస్సుకు రావడం ఎందుకని కడప ఆర్డీవో జాన్ ఎల్విన్ మండల సర్వేయర్ ప్రియాంక, తహసీల్దారు రమణమ్మలపై అసహనం వ్యక్తం చేశారు. గురువారం పెన్నపేరూరు గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కడప ఆర్డీవో హాజరయ్యారు. రాజంపేట టీడీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట డివిజనల్ ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అనంతరం ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు ముఖ్య ఉద్దేశ్యాన్ని అధికారులు ప్రజలకు వివరించారు. కాగా కొందరు ఆక్రమణదారులు తమ భూములను ఆక్రమించారని ఆర్డీవోకు దళితులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆరా తీసిన ఆర్డీవో మ్యాప్‌లో ఆక్రమణ అయిన భూమిని చూపమని తహసీల్దారు, సర్వేయర్‌ను అడగ్గా వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహించారు. మీలాంటి అధికారులు రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని, రెవెన్యూ సమస్యలు తెలుసుకోకుండా మ్యాప్‌లో ఉన్న ప్రాంతాన్ని చూపకపోవడం ఏమిటని ప్రజల ముందే ప్రశ్నించారు. అనంతరం గ్రామస్థులు గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున భూములు మండలంలో ఆక్రమణ జరిగాయని వాటిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ ద్వారా విచారణ చేపడతామన్నారు.

సిద్దవటం: రైతుల భూ హక్కుల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని రైతులు భూ సమస్యలపై ఇచ్చిన ప్రతి అర్జీ పరిష్కారమే రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని కడప ఆర్డీవో జాన్‌ఎర్విన్ తెలియజేశారు.


తహసీల్దారు రమణమ్మ, సర్వేయర్ ప్రియాంకపై అసహనం వ్యక్తం చేస్తున్న ఆర్డీవో

గాలివీడు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి డీఎస్‌ఓ రఘురాం తెలిపారు. గురువారం మండలంలోని నూలివీడు పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, మండల సర్వేయర్ మురళి, వీఆర్వో వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచు ఫరీద్‌బాషా, మాజీ ఎంపీటీసీ పార్వతమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నమండెం: చిన్నమండెంలోని సచివాలయం-2లో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తహసీల్దారు నరసింహులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో కేవలం 10 అర్జీలు

సుండుపల్లె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కార వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. అందులో భాగంగా గురువారం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో సుండుపల్లె-1 సచివాలయంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి జయరాములు, తహసీల్దారు దైవాదీనం, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో రవీంద్ర నాయక్‌లు హాజరయ్యారు. ఉదయం 11 గంటలైనా పట్టుమని పది మంది రైతులు కూడా రెవెన్యూ సదస్సుకు హాజరు కాలేదు. ఎవరూ రెవెన్యూ సదస్సుకు హాజరుకాకపోవడం ఏమిటని అధికారులు ప్రశ్నించగా మండల కేంద్రమైన సుండుపల్లెలో వ్యవసాయ భూమి తక్కువగా ఉందని, అందుకే రైతులు ఎక్కువ మంది రాలేదని తహసీల్దారు దైవాదీనం తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెవెన్యూ కార్యాలయంలో రైతుల సమస్యలు పెద్దగా పరిష్కారం కావడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. ఆలయ భూములకు హద్దులు చూపించాలని, స్మశాన వాటిక ఆక్రమణలకు గురవుతోందని, రీ-సర్వేలో తప్పులు జరిగాయని, కొత్త రేషన్‌కార్డు కోసం, భూముల ఆన్‌లైన్ కోసం ప్రజల నుంచి వినతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

● చమర్తి జగన్‌మోహన్‌రాజుకు గురుకుల టీచర్స్, లెక్చరర్ల వినతి

రాయచోటిటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకులాల్లో గత పది సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న టీచర్లు, లెక్చరర్లకు న్యాయం చేయాలని ఆ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన బిడ్డల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ అతి తక్కువ జీతంతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, ప్రభుత్వ విధానంలో అవుట్ సోర్సింగ్ విధానమే లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరే పనిచేస్తున్నామన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు జగన్‌మోహన్‌రాజును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అతి త్వరలోనే విద్యా శాఖ మంత్రి లోకేశ్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుళ్లాయప్ప, విజయలక్ష్మి, సుమతి, స్వర్ణలత, మహేదేవ, కదాంబరి, రహీమ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


జగన్‌మోహన్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

ఇరువర్గాల మధ్య గొడవ

● స్థానికులు ఫొటోలు తీయడంతో జారుకున్న వైనం

మదనపల్లె, అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల వదిలిన సమయంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురు రోడ్డులో ఇరువర్గాల విద్యార్థులు గురువారం గొడవపడ్డారు. దీంతో విద్యార్థులు అందరూ అక్కడ గుమికూడారు. దీంతో అటుగా వెళుతున్న స్థానికులు ఫొటోలు, వీడియోలు తీయడంతో వారు చిన్నగా అక్కడ నుంచి జారు కున్నారు. పలు మార్లు పాఠశాల సమీపంలో విద్యార్థులు గొడవలు పడడటం పరిపాటిగా మారుతోంది. ఇటు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అటు పోలీసుల చొరవ చూపి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు దురాక్రమణలపై కార్యాచరణ

పెనగలూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెనగలూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు దురాక్రమణలపై కార్యాచరణ ప్రారంభించారు. స్థానిక ఆదర్శ పాఠశాల సమీపం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు, హైస్కూల్ సమీపంలో గల సిద్ధవరం క్రాస్‌రోడ్డు నుంచి సిద్దవరం పంచాయతీ హద్దు వరకు గురువారం మండల సర్వేయర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సచివాలయ సర్వేయర్ల బృందం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా రోవర్ మిషన్‌తో ఆక్రమణలను గుర్తించారు. ఈ కార్యక్రమం రాజంపేట ఆర్‌అండ్‌బీ డీఈఈ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. దురాక్రమణలు పెరిగిపోతూ రోడ్డు బాగా కుచించుకుపోతున్నందున ప్రజలు నిత్యం అసహనానికి గురవుతున్నారని, ఉన్నతాధికారులకు ఫిర్యాదులూ వచ్చినందున తొలగించేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ మధుసూదన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ దురాక్రమణ సమాచారాన్ని ముందుగా జిల్లా కలెక్టర్‌కు సమర్పించి అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలతో కార్యాచరణ చేపడతామని తెలిపారు.


స్థలాలను గుర్తిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈఈ, సర్వేయర్

అంబేడ్కర్‌ను అవమానించడం తగదు

రైల్వేకోడూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానిస్తే రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోశాలదేవి, రాష్ట్ర సీనియర్ నాయకుడు శాంతయ్యలు తెలిపారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు గురువారం అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి పార్లమెంట్‌లో ఉంటూ అంబేడ్కర్‌ను అవమానించడం ఎంత వరకు సబబు అని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇటు రాజ్యాంగం, అటు ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తూనే ఉందని తెలిపారు. అమిత్‌షా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిగమాల రమేష్, శివక్రిష్ణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవహేళనగా మాట్లాడినందుకు క్షమాపణ చెప్పాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. గురువారం లక్కిరెడ్డిపల్లెల్లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాయకుంటే ఈరోజు భారతదేశంలో అణగారిన దళిత, గిరిజన కులాలకు న్యాయం జరిగి ఉండేది కాదన్నారు. హోంమంత్రి బడుగులకు క్షమాపణ చెప్పకుంటే దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజంపేటలో నేడు జాబ్‌మేళా

నందలూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (ఎస్ఈఈడీఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణతో నిమిత్తం లేకుండా నేరుగా ఐసీఐసీఐ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఏపీఎం శ్రీహరి తెలియజేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆకేపాడు క్రాస్‌రోడ్డు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి సత్యకుమార్‌తో సాయిలోకేశ్ భేటీ

రాజంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌తో రాజంపేట బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్ భేటీ అయ్యారు. గురువారం సాయంత్రం సచివాలయంలో మంత్రిని కలిసి పలు విషయాలు చర్చించారు. ప్రధానంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, జిల్లాలో కూటమి ప్రభుత్వం వ్యవహారం, ప్రధానంగా బీజేపీ బలోపేతంపై చర్చించారు. జిల్లా పర్యటనకు రావాలని సత్యకుమార్‌ను ఆహ్వానించగా, త్వరలో పర్యటిస్తానని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ అంశాలను చర్చిస్తూ వాటిని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.


మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో భేటీ అయిన సాయిలోకేశ్

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

గాలివీడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి లక్ష్మణనాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులను మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన వైద్యం అందించాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


నూలివీడు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా అధికారి

నారా లోకేశ్‌ను కలిసిన సుధాకర్

సుండుపల్లె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సుండుపల్లె మండలానికి చెందిన టీడీపీ నాయకుడు గుండ్లపల్లె సుధాకర్ తెలిపారు. మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సుధాకర్ ఈ సందర్భంగా తెలిపారు. యువతకు టీడీపీలో ప్రత్యేక స్థానం కల్పిస్తున్నామని, పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత ఉంటుందని మంత్రి స్పష్టం చేసినట్లు తెలిపారు. ఆయనను కలిసిన తరువాత రాష్ట్రంలోని యువతకు మంచి రోజులు రానున్నాయన్న విశ్వాసం కలిగిందన్నారు.


విజయవాడలో లోకేశ్‌తో గుండ్లపల్లె సుధాకర్

చెరువులకు నీరు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగోతు రమేష్‌నాయుడు

రాజంపేటటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు ఆధారిత చెరువులకు అధికారులు నీరందించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా బాహుదా నదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తోందన్నారు. గతంలో అన్నమయ్య ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా రాజంపేట పరిసర ప్రాంతాల్లోని చెరువులకు నీరు వచ్చేదని, ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ఆ పరిస్థితి లేదన్నారు. అధికారులు స్పందించి వచ్చిన నీటిని వృథా కానివ్వకుండా లిఫ్టు ఇరిగేషన్ పద్ధతిలో చెరువులకు నీరు అందించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర క్షత్రియ సంఘం డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్ రాజు, బీజేపీ మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, శివనారాయణచౌదరి, క్రిష్ణయాదవ్, మేకవారిపల్లె రమణ, ఎం.సుబ్రమణ్యం, మస్తాన్, తోట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

ఒంటిమిట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను రాష్ట్ర సచివాలయంలో కల్లుగీత సంఘం మాజీ రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, స్థానిక టీడీపీ నాయకులు కోరారు. మండలంలోని సుమారు 1500 ఎకరాల ఆయకట్టు, పరోక్షంగా మరో రెండు వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే ఒంటిమిట్ట చెరువు పంపింగ్ స్కీంకు శాశ్విత ప్రాతిపదికన మూడు కి.మీ. మేర ఇనుపగొట్టాలతో నిర్మాణం చేయాలని, అందుకు అవసరమయ్యే రూ.10.5 కోట్లను మంజూరు చేసి మండల రైతాంగాన్ని ఆదుకోవాలని మండల టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, చెరువు సంఘం డైరెక్టర్ రేవిళ్ల బాలమునెయ్య, మామిళ్ల రామక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


ఇరిగేషన్ మంత్రితో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నేడే సామాజిక తనిఖీలు

చిన్నమండెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ కార్యాలయం నందు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 19వ విడత సామాజిక తనిఖీ జరుగుతుందని ఏపీవో మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై బహిరంగ చర్చా వేదికను ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. సామాజిక తనిఖీ సభకు ఉపాధి కూలీలు విధిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

కబ్జాదారులు ఉన్నారు జాగ్రత్త...

- భూసమస్యలపై సివిల్ కోర్టులో బాధితులు
- అక్రమాలకు స్వస్తి పలికేది ఎన్నడు
- జిల్లాలో ఆగని భూఅక్రమాలు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో జేబు దొంగలున్నారు జాగ్రత్త అని పోలీసులు బోర్డులు పెట్టేవారు. అందులో కొంత మంది ఫొటోలు కూడా అతికించి వీరు దొంగతనాలకు పాల్పడతారు.. మీరు జాగ్రత్తగా ఉండండి అని హెచ్చరిక బోర్డులో ఫొటోలు ఉంచేవారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దొంగతనాలు అరికట్టడం చాలా వరకు సాధ్యమైంది. ఆధునిక సమాజంలో రెండు డిపార్టుమెంట్ల వారు కాస్తా నిర్లక్ష్యం వహిస్తే సమాజం భ్రష్టు పట్టిపోతుంది అనే వాదన కూడా లేకపోలేదు. అందులో ఒకటి పోలీస్, రెండు రెవెన్యూగా చెప్పవచ్చు. పోలీసులు ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ ఉపయోగించి దొంగతనాలు జరగకుండా అరికట్టగలుగుతున్నారు. రెవెన్యూ వారు మాత్రం భూకబ్జాల నుంచి ప్రజలను కాపాడలేకపోతున్నారనే విమర్శలున్నాయి. గ్రామాల్లో వీఆర్‌వోల పాత్ర కీలకంగా ఉండడంతో ప్రతి గ్రామంలోనూ అసైన్డ్ భూములు, ఎండోమెంట్ భూములు, గ్రామ కంఠాలు, వంకలు, వాగులు, చెరువులు ఆన్‌లైన్ చేసి కొంత వసూలు చేస్తున్నారని ప్రచారం ఉండేది. గత ప్రభుత్వంలో అన్నీ పూర్తి చేసేశారో ఏమో ఇప్పుడు గ్రామంలో ఎవరైతే లేరో వారి భూములు అవలీలగా వన్‌బీ, అడంగల్ ఎక్కించి అందినంత పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో దాదాపు 75 శాతం అర్జీలు అన్నీ కూడా భూకబ్జాలకు గురయ్యాయని అధికారుల దగ్గర లెక్కలు ఉన్నాయి. గతంలో జరిగిన భూఅక్రమాలకు పరిష్కారం దొరకక కొంతమంది బాధితులు సివిల్ కోర్టు తలుపు తడుతున్నారు. జిల్లాలో రాజంపేట, మదనపల్లె డివిజన్లలో ఎక్కువగా భూఅక్రమాలు గతంలో జరిగాయని, వీటికి పరిష్కారం కోసం తహసీల్దార్ల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వారు జేసీ కోర్టు, ఆర్డీవో కోర్టుకు వచ్చామని చెబుతున్నారు. 2019-24 వరకు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా భూఅక్రమాలు జరిగాయని, జిల్లా అధికారులు ఒక అంచనాకు వచ్చారు. రికార్డు పరంగా అన్ని ఆధారాలు ఉన్న బాధితుల కోసం పరిష్కారం వెతుకుతూ ఒక్కొక్క కేసును డిస్పోజల్ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రికార్డ్స్ ఆధారంగా పూర్తిగా పరిశీలన చేసి కేసును త్వరిగతిన పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రాయచోటి మండలం శిబ్యాల గ్రామానికి చెందిన దళితుల భూమిని కొందరు ఆక్రమించారని వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొంతమంది ఆర్డీవో కోర్టులో పిటీషన్ వేసుకొని అక్కడ సరైన ఆధారాలు లేకపోవడంతో ప్రత్యర్థులపై మళ్లీ జేసీ కోర్టుకు కూడా వెళుతున్న పరిస్థితులు ఇక్కడ చాలా ఉన్నాయి. ఏదైనా భూమిని ఆక్రమించాలంటే ముందు తప్పుడు రికార్డ్స్ సృష్టించి ఆ తర్వాత పొలం మీదికి వెళ్లే పరిస్థితులు గతంలో ఎక్కువగా జరిగాయని రిటైర్డ్ తహసీల్దార్లు చెబుతున్నారు. ఈ విషయంపై డీఆర్వో మధుసూదన్‌రావును వివరణ కోరగా... మదనపల్లి, రాజంపేట డివిజన్లలో ఎక్కువ అక్రమాలు జరిగాయని, మేము ఒక అంచనాకొచ్చాము. అయితే ఆర్‌వోఆర్ కోర్టులో వేసుకున్న ప్రతి బాధితునికి న్యాయం చేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాము. పూర్తి రికార్డు పరిశీలన చేసిన తర్వాతే తదుపరి ఆర్డర్స్ ఇస్తున్నాం.



రాయచోటి మండలం శిబ్యాల గ్రామంలో తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు (ఫైల్)

కేసులు నమోదు చేయాలి



పేదల భూములు ఆక్రమించి తప్పుడు రికార్డులు సృష్టించే వారిని రెవెన్యూ, పోలీసు వారు గుర్తించి కేసులు నమోదు చేస్తే కొంతవరకు భూఅక్రమాలకు కళ్లెం వేయొచ్చని మా అభిప్రాయం. రెండు ఎకరాలు భూమి గల పేదవాడు పొట్టకూటి కోసమై పట్టణానికి వెళితే ఆ భూమిని ఆ గ్రామంలో ఉన్న వారు కబ్జాలకు పాల్పడుతుంటే రెవెన్యూ వారికి తెలియకుండానే ఇదంతా జరుగుతోందా అని మేము ప్రశ్నిస్తున్నాం. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టలేదనేది సామెత. అలాగే రెవెన్యూ వారి సహకారం లేకుండానే జిల్లాలో భూఅక్రమాలు జరుగుతున్నాయా అని మేము జిల్లా అధికారులను అడుగుతున్నాం. ఎక్కడైతే భూఆక్రమణలు జరిగాయో ఆ గ్రామానికి సంబంధించిన వీఆర్‌వోలను తక్షణం సస్పెండ్ చేసి విచారణలో అవసరమైతే తహసీల్దార్‌ను కూడా సస్పెండ్ చేస్తే తప్ప భూఅక్రమాలకు కళ్లెం వేయలేం.

- జి.ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

రామానాయుడి చెరువు చుట్టూ ట్రెంచ్ తీసిన పోలీసులు



రామానాయునిచెరువు చుట్టూ ట్రెంచ్ తీస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురుల అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి రెవెన్యూ, పోలీస్ అధికారులు రామానాయునిచెరువు చుట్టూ గురువారం ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ కొట్టించారు. ఈ చెరువులో కొన్ని నెలలుగా ఇసుక వ్యాపారులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై పత్రికలో పలుమార్లు వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో జిల్లా అధికారులు ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ క్రమంలో రామానాయునిచెరువు చుట్టూ గురువారం ఎక్స్‌కవేటర్ సాయంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో ట్రెంచ్ తీయించారు. ఇసుక ట్రాక్టర్లు చెరువులోకి ప్రవేశించే మార్గాలను మూసేశారు. ఈ క్రమంలో సుమారు 10 అడుగుల లోతు వరకు ట్రెంచ్‌ను కొట్టించారు. ఈ ట్రెంచ్ దాటుకుని చెరువులోకి ఇసుక ట్రాక్టర్లు ప్రవేశిస్తే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే ప్రతిరోజు రెవెన్యూ సిబ్బంది అక్రమ ఇసుక రవాణాపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.

కళాశాలలో భద్రత కట్టుదిట్టం చేయండి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌బాబు

వాల్మీకిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ఏపీ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ రమామంజులతో మాట్లాడుతూ కళాశాల ఆవరణలో సీసీ కెమెరాలను పూర్తి స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. బాలికల హైస్కూల్, కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండటం తో ఇరు యాజమాన్యాలు బాధ్యతగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి ముఖద్వారం వద్ద కూడా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అనుమానిత వ్యక్తులు కళాశాల పరిసరాలలో కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గత ఆదివారం రాత్రి కళాశాలలో ఆకతాయిల ప్రవర్తన పట్ల ఆ ప్రాంతంలో రాత్రి గస్తీ కూడా పెట్టామని తెలిపారు. కళాశాలలో సమస్యల పరిష్కారం విషయమై స్థానిక ఎంపీడీవో మనోహరరాజు, ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్‌లు పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగం

- పనులు చేయకుండానే బిల్లులు
- రికార్డులు పరిశీలించిన డీఎల్‌పీవో



నిధుల దుర్వినియోగంపై విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో

సుండుపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వమంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మండల అభివృద్ధి నిధుల నుంచి గ్రామ పంచాయతీ నిధుల వరకు ఏ గ్రామంలో చూసినా లక్షలు భోంచేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు వైసీపీ నాయకులు, వైసీపీ మద్దతుదారులైన ప్రజాప్రతినిధుల జేబులు నింపుకునేందుకు అన్నట్లుగా ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేశారు అనడంతో ఎటువంటి సందేహం లేదు. అలాంటిదే మండలంలోని ఒక చిన్న గ్రామ పంచాయతీ అయిన చిన్నగొల్లపల్లె. ఆ గ్రామంలో సుమారు రూ.40 లక్షల నిధుల దుర్వినియోగమయ్యాయని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య కొన్ని రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా గురువారం చిన్నగొల్లపల్లె సచివాలయంలో నిధుల దుర్వినియోగంపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజంపేట డీఎల్‌పీవో మస్తాన్‌వలీ విచారణ నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు చిన్నగొల్లపల్లె పంచాయతీకి చెందిన పంచాయతీ నిధులు, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో రికార్డులను తనిఖీ చేశారు. కొన్ని ఎం-బుక్కులు రికార్డు చేశారు. మరికొన్ని బిల్లుల రూపంలో పెట్టి డ్రా చేసినట్లు రికార్డుల పరిశీలనతో తేలిందని డీఎల్‌పీవో మస్తాన్‌వలీ తెలిపారు. సమగ్రంగా విచారించి శుక్రవారం పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. అప్పయ్యగారిపల్లెకు సీసీ రోడ్డు వేయకుండానే వేసినట్లు రూ.1.74 లక్షల నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పెద్దమొత్తంలో పనులు చేయకుండానే డబ్బులు డ్రా చేసి ఇష్టారాజ్యంగా వాడుకున్నారని, రెండు సంవత్సరాల వ్యవధిలో జరిగిన పనులను పల్లెల్లోకి వెళ్లి సమగ్రంగా విచారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌ఆర్‌డీ సురేశ్ బాబు, సర్పంచ్ జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి వైసీపీ నేతల డుమ్మా

- బి.కొత్తకోట మండలమీట్ వాయిదా..
- మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్న కూటమి శ్రేణులు



మండల పరిషత్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు

బి.కొత్తకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సర్క్యులర్ పంపారు. అయితే మండలంలోని 11 మంది ఎంపీటీసీ సభ్యులు, 15 మంది సర్పంచులలో ఏ ఒక్కరూ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో గంటపాటు వేచి చూసి సమావేశాన్ని నిర్వహించేందుకు అవసరమైన కోరం లేకపోవడంతో మండలమీట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శంకరయ్య మధ్యాహ్నం 12 గంటలకు ప్రకటించారు. సెప్టెంబరు 20న జరగాల్సిన సమావేశం కూడా కోరంలేక రద్దు అయిన నేపథ్యంలో ఈనెల 19న జరపాలని భావించారు. అయితే ఎంపీపీ లక్ష్మీనరసమ్మ సహా సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో వాయిదా వేశారు. ఈ విషయమై కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు నివేదిక సమర్పించినట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా గత సమావేశం రోజున కూటమి నాయకులు మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుని ప్రస్తుతం ఉన్న సభ్యులెవరూ ప్రజలచేత ఎన్నిక కాకుండా ఎవరో సెలెక్ట్ చేస్తే అక్రమమార్గంలో వచ్చారని, వారందరూ రాజీనామా చేసి ఎన్నికల్లో గెలిచి రావాలంటూ అడ్డు తగిలారు. అలాగే గురువారం కూడా అదే సీన్ రిపీట్ అయింది. కార్యాలయం వద్దకు కూటమి నాయకులు భారీగా చేరుకున్నారు. సీఐ జీవన్‌గంగాధర్ బాబు పర్యవేక్షణలో పోలీసులు కూటమి నాయకులను లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో వీరు గేటు వద్దే గుమికూడి సెలెక్టెడ్ వైసీపీ సభ్యులను రానివ్వబోమని నినాదాలు చేస్తూ అక్కడే వేచి ఉన్నారు. ఎట్టకేలకు సమావేశం వాయిదా పడటంతో హాజరైన మండలస్థాయి అధికారులతో సహా అందరూ తిరుగుముఖం పట్టారు.

జడ్జి బంగ్లాలో శ్రీగంధం చెట్ల నరికివేత



గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన శ్రీగంధం చెట్లు, పరిశీలిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని కదిరి రోడ్డులో గల బంగ్లాలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు శ్రీగంధం చెట్లను నరికివేసి మొదళ్లను తీసుకెళ్లిపోయారు. ఉదయం గమనించిన జడ్జి బంగ్లా అటెండర్ మునివెంకట్ గురువారం వన్‌టౌన్ సీఐ ఎరిసావలికి ఫిర్యాదు చేశారు. వెంటనే మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, ఎస్ఐ వెంకటశివ కుమార్ జడ్జి బంగ్లాకు చేరుకుని చెట్ల నరికివేతను పరిశీలించారు. అనంతరం అటెండర్ మునివెంకట్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పెన్నపేరూరును తనిఖీ చేసిన ఆర్డీవో



గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో

ఒంటిమిట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల వెనుకజలాల ద్వారా పెన్నపేరూరు గ్రామంలోకి నీరు రావడాన్ని ఆర్డీవో జాన్ ఎర్విన్ దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఏ మేరకు నీరు చేరుతోంది.

సోమశిల బ్యాక్‌వాటర్ పరిధి ఏ మేరకు ఉందనే దానిపై సోమశిల అథారిటీ ద్వారా సమాచారం తెప్పించుకుని పూర్తి నివేదిక తయారు చేయాలని తహసీల్దారు రమణమ్మకు సూచించారు. గ్రామంలోని ప్రజలకు ఇబ్బంది కలగకుండా శానిటేషన్ వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచాలని నిరంతరం ప్రజలకు సేవలందించాలని ఆయన సూచించారు. ఇళ్లకు పరిహారం ఇవ్వాలని, పరిహారం ఇస్తే ఇక్కడి నుంచి వెళతామని ఆర్డీవోకు స్థానికులు తెలపడంతో దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని ఆయన అన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రెవెన్యూ స్థలాల్లో అక్రమ కట్టడాలు తొలగించేందుకు రెవెన్యూశాఖ ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ స్థలాలు కనపడితే ఆక్రమణదారులు పాగా వేయడం, రాత్రికి రాత్రే కట్టడాలు మితిమీరిపోయి వారికి అడ్డూ అదుపులేకుండా పోయింది.

మండలంలోని పెద్దపల్లె రెవెన్యూ సర్వేనంబరు 641/1 లెటర్ భాకరాపేట గ్రామానికి చెందిన తుర్రా సుబ్బలక్షుమ్మ వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ పెద్దలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ వంక పోరంబోకు స్థలాన్ని 11 సెంట్లు ఆక్రమించి స్థలాన్ని అన్యాక్రాంతం చేశారు. మాధవరం గ్రామం సర్వేనంబరు 864/7 గ్రామ సచివాలయం-2 పరిధిలో గత ప్రభుత్వంలో వంక పోరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవనాలను నిర్మించారు. పలువురు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూశాఖ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపి పూర్తిగా భవనాలు తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం చేసిన వారిపై చర్యలు చేపట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవిలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

చెంగుచెంగున..

అది ఆషామాషా వన్యప్రాణి కాదు.. రామాయణంలో శ్రీరామచంద్రమూర్తి సీతతో కలిసి వనవాసం వెళ్లిన సమయంలో.. సీతమ్మకు కనువిందు చేసిన ప్రాణి. రామాయణంలో సీతారాముల జీవితం మలుపు తిరగడానికి.. ఒక రకంగా చెప్పాలంటే రావణసంహారానికి కారణం ఇదే వన్యప్రాణి. అయితే రామాయణంలో విన్నది మాయలేడి (జింక) గురించి.. నిజమైన లేడిని చూడాలంటే కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం కళాశాల వెనుకవైపునకు వెళితే చాలు. ఇక్కడ ఈ అందమైన వన్యప్రాణులు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. చెంగుచెంగున ఎగురుతూ కనువిందు చేస్తాయి. అక్కడికి నిత్యం గుంపులుగా వచ్చి మేతమేసి వెళుతున్నాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప











జీవితానికి ఆర్థిక భరోసా... పీఎల్ఐ

● తక్కువ ప్రీమియం...ఎక్కువ బోనస్

● పాలసీల ద్వారా ఉద్యోగుల జీవితాలకు వెలుగులు

కడప మారుతీనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన తపాలా జీవిత బీమా పథకం (పీఎల్ఐ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలకు ఆర్థిక భరోసానిచ్చేలా దోహదపడుతోంది. 1884 ఫిబ్రవరి 1న కేవలం తపాలాశాఖలో ఉద్యోగం చేసే పురుషుల కోసం ప్రారంభైన పీఎల్ఐ కాలగమనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కార్పొరేషన్ ఉద్యోగులు, గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాలల ఉద్యోగులు, ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ, విద్యనభ్యసించి ప్రయివేటు ఉద్యోగం చేసేవారు. బ్యాంక్ ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, చార్టెడ్ అకౌంటెంట్లు తదితర విభాగాల వారికి వర్తించేలా కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ ఇటీవల జీవో జారిచేసింది.

18 నుంచి 55 సంవత్సరాల లోపు వారు అర్హులు

పీఎల్ఐ స్కీంలో చేరేందుకు 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులు. ఇందులో పాలసీని రూ.20 వేల నుంచి దాదాపు రూ.50 లక్షల వరకు తీసుకునే సౌకర్యముంది. ఇదిలా వుండగా 2017 ఏప్రిల్ 1న వెలువడిన జీవో ప్రకారం పైన తెలిపిన ఉద్యోగులు పీఎల్ఐ పాలసీలు తీసుకునే సౌకర్యాన్ని కేంద్రప్రభుత్వం కల్పించింది. పాలసీలు మూడు విధాలుగా 3 నెలలు, 6 నెలలు, 1 సంవత్సరానికి ఒకసారి కట్టుకునే సౌలభ్యం కల్పించింది. కాగా 6 నెలలకు ఒకసారి కట్టుకునే పాలసీకి 1 శాతం, సంవత్సరం పాలసీకి 2 శాతం డిస్కౌంట్ వర్తించే సౌలభ్యం కలదు. పీఎల్ఐలో ప్రధానంగా 6 రకాల పాలసీలు అమలవుతున్నాయి. వాటిలో సువిధ, సుమంగళి, యుగళ్ సురక్ష, సురక్ష, సంతోష్, బాలజీవన్ బీమా పాలసీలున్నాయి.

సువిధ : ఇందులో హోల్ లైఫ్ పాలసీదారులు 5 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత సంతోష్ పాలసీలోకి మారే వెసులుబాటు కల్పించారు. తక్కువ డబ్బులు కట్టుకునే వీలుతో పాటు రుణం తీసుకునే సౌకర్యం కలదు.

సుమంగళి : ఈ పాలసీని మనీ బ్యాక్ పాలసీ అని కూడా అంటారు. ఈ పాలసీలో 15 సంవత్సరాల పాటు కట్టిన పాలసీదారులు వరుసగా 6 సంవత్సరాలు పూర్తి కాగానే కట్టిన మొత్తం నుంచి 20 శాతం, 9 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, 12 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, చివరగా 15 సంవత్సరాల తర్వాత 40 శాతం డబ్బులతో పాటు అదనపు బోనస్ చెల్లింపు వర్తిస్తుంది. దీంతో పాటు 20 సంవత్సరాల పాలసీల బోనస్‌తో లభిస్తుంది. ప్రధానంగా మధ్యతరగతి ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరం.

యుగళ్ సురక్ష : ఇది జాయింట్ పాలసీ. ప్రీమియం ఒకరు చెల్లించాల్సి వుంటుంది. రిస్క్ కవరేజ్ మాత్రం ఇద్దరికి (భార్యా-భర్తలకు) వర్తిస్తుంది. ఈ పాలసీకి సంతోష్ పాలసీ నిబంధనలు వర్తిస్తాయి. ఇందులో 5 నుంచి 20 సంవత్సరాలలోపు వయస్సు గల వారు మాత్రమే అర్హులు. కాగా ఈ పాలసీ కింద రూ.3లక్షల కంటే మించి ఇవ్వరు. తల్లిదండ్రులు ఇద్దరిలో కచ్చితంగా పాలసీ వుంటేనే వర్తిస్తుంది.

సురక్ష : హోల్ లైఫ్ పాలసీ. ఇందులో 19 సంవత్సరాల నుంచి 58 సంవత్సరాల గల వారు పాలసీకి అర్హులు. రూ.20 వేల నుంచి 50 లక్షల వరకు పాలసీ ప్రీమియం. కాగా 4 సంవత్సరాలు కట్టిన తర్వాత రుణం తీసుకునే సౌలభ్యం కలదు. సుమారు 60 సంవత్సరాల పాటు ప్రీమియం కట్టాల్సి వుంటుంది. 80 సంవత్సరాల తర్వాత డబ్బులు తీసుకోవచ్చు. ప్రతి లక్ష రూపాయలకు రూ.7600 బోనస్‌గా సంవత్సరానికి అందుతుంది.

సంతోష్ : ఈపాలసీ తీసుకున్న వారు 3 సంవత్సరాల తర్వాత రుణం తీసుకునే సదుపాయం కలదు. కాగా కట్టిన ప్రీమియం మొత్తం ట్యాక్స్ సేవింగ్ బెనిఫిట్ కింద వెసులుబాటు కలదు. పాలసీ ఆమోదించిన నాటి నుంచి పూర్తి జీవిత రక్షణ వుంటుంది. తపాలా శాఖ ద్వారా తీసుకున్న పాలసీలలో అధిక శాతం (80 శాతం) మంది వినియోగదారులు ఈ సంతోష్ పాలసీవైపే మొగ్గుచూపుతున్నారు.



కడప తపాలా శాఖ ప్రధాన కార్యాలయం

బాలజీవన్ పాలసీ : 5 నుంచి 20 సంవత్సరాల లోపు బాల, బాలికలు అర్హులు. ప్రధానంగా పీఎల్ఐ పాలసీలో వారి తల్లి-దండ్రులు నమోదై వుంటేనే.. బాలజీవన్ పాలసీ వర్తిస్తుంది. ఇందులో రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకూ పాలసీ తీసుకునే సౌకర్యం కలదు.

పీఎల్ఐ పాలసీ ద్వారా మంచి రాబడి



తపాలా శాఖ ద్వారా అందే పీఎల్ఐ పాలసీ ద్వారా మంచి రాబడి అందుతుంది. మిగతా అన్ని ఇన్సూరెన్స్ సంస్థల నుంచి వచ్చే రాబడి కన్నా మెరుగైన ఆదాయం వస్తుంది. అన్ని రకాల ఉద్యోగులు పీఎల్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

-రాజేష్, ప్రధాన తపాలా కార్యాలయ సూపరింటెండెంట్

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రమాదకరం



ధర్నాలో ప్రసంగిస్తున్న 1104 యూనియన్ నాయకుడు

ఎర్రగుంట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆర్టీపీపీలో ఉద్యోగులు గురువారం పవర్‌హౌస్ మెయిన్ గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఉత్తరప్రదేశ్, చండీఘర్‌లోని డిస్కంల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏఐఎఫ్ఈఈ, ఎన్‌సీసీ ఏఈఈఈ పిలుపు మేరకు నిరసన చేపట్టి ఉద్యోగులు నినాదాలు చేశారు. ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటీకరణతో వచ్చే పరిణామాలతో ప్రజలపై మోయలేని విద్యుత్ భారం పడుతుందన్నారు. ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

నాలుగు పంచాయతీలకు తీరనున్న మంచినీటి కష్టాలు

● చిత్రావతి నుంచి రూ.7.3 కోట్లతో మంచినీటి పైపులైను

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు మంచినీటి కష్టాలు తీరనున్నాయి. గత వేసవిలో పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నా, గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే మంచినీటి కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందులో భాగంగా మొదటి విడతగా ప్రాధన్యత క్రమంలో నీటిఎద్దడి ఉన్న పంచాయతీలను అధికారులు గుర్తించారు. కొండాపురం, ఓబన్నపేట, తాళ్లప్రొద్దుటూరు, సుగుమంచిపల్లె పంచాయతీలలో మంచినీటి ఎద్దడిని తీర్చేందుకు ఏటూరు వద్ద నున్న చిత్రావతినది నుంచి పైపు లైను వేయనున్నారు. ఇందుకోసం రూ.7.3 కోట్లతో నాలుగు బ్లాకులుగా టెండర్లు కూడా పిలిచారు. ఇందులో తాళ్లప్రొద్దుటూరు, ఓబన్నపేట పంచాయతీలకు టెండర్లు పూర్తయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కొండాపురం, సుగుమంచిపల్లె పంచాయతీలకు సంబంధించి టెండర్లలో కాంట్రాక్టర్లకు అర్హత లేకపోవడంతో రద్దయినట్లు తెలిపారు. త్వరలోనే వీటికి కూడా తిరిగి టెండర్లు పిలుస్తారని ఏఈ తెలిపారు.

లావనూరు వద్ద జరిగింది హత్యేనా?

● పోలీసుల అదుపులో నిందితులు

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు సమీపంలో మంగళవారం అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన సురేష్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. రెండు రోజులుగా కొండాపురం పోలీసులు యల్లనూరులో విచారిస్తున్నారు. యల్లనూరు నుంచి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ కేసులో పోలీసులు ముగ్గురిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా ఒక జీపును కూడా స్వాధీనపరుచుకున్నట్లు సమాచారం. సంఘటన స్థలంలో పడిన మృతదేహం తీరు, పోస్టుమార్టం ఆధారంగా సురేష్‌ది హత్యగానే పోలీసులు భావిస్తున్నారు. కాగా నిందితులను నేడో, ఎల్లుండో అరెస్టు చేసే అవకాశం ఉంది.

పొలం పనిచేస్తూ... మహిళా కూలీ మృతి



పొలం వద్ద మృతి చెందిన మహిళా కూలీ రామక్క

వల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామ పొలంలో గురువారం పొలం పనిచేస్తూ మహిళా కూలీ రామక్క హఠాత్తుగా మృతి చెందింది. తోటి కూలీల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండల పరిధిలోని సీతంపల్లెకు చెందిన ఓ రైతు పెద్దపుత్త గ్రామ పొలాల్లో భూమిని కౌలుకు తీసుకుని దోస తోట సాగు చేశాడు. అందులో కలుపు తీయడానికి తమ గ్రామం నుంచి సుమారు 30 మంది కూలీలను ఆటోల్లో తీసుకుని వచ్చాడు. ఉదయం నుంచి పొలంలో కలుపుతీత పనులు చేస్తుండగా కూలీల్లో ఒకరైన రామక్క మధ్యాహ్నం సుమారు 3.30గంటల సమయంలో ఉన్నట్లుండి కుప్పకూలి స్పృహ తప్పి పడిపోయింది. తోటి కూలీలు ఆమెకు సపర్యలు చేస్తూ 108 వాహనానికి ఫోను చేశారు. వారు వచ్చి పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైరు చోరీ



లింగాల,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదండ్ల గ్రామలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును దొంగిలించారు. విద్యుత్ శాఖ ఏఈ బాలసంజీవులు మాట్లాడుతూ కరెంటు ఉండగానే ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్ లైన్ కట్ చేసి ఒక ఫేజ్ మరొక ఫేజ్‌వైరు టచ్‌కాకుండా తాడుతో కట్టి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపర్ వైరు దొంగిలించారన్నారు. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేయడంతో సుమారు లక్ష రూపాయలు సంస్థకు నష్టం వాటిల్లిందని, ఆ మేరకు లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

పెనుగొండకు కేంద్ర సాహిత్య పురస్కారం అభినందనీయం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడం అభినందనీయమని కడప జిల్లా అరసం అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఈశ్వర‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెనుగొండ లక్ష్మీనారాయణ కవిగా రచయితగా విమర్శకుడిగా న్యాయవాదిగా బహుముఖ కోణాల్లో సామాజిక సేవ చేశారన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ జాతీయ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించారని, ఇతర రాష్ట్రాల రచయితలకు తెలుగువారి గొప్పదనాన్ని తెలియజేశారన్నారు. భారతదేశంలో సామాజిక కల్లోలాలు ఏర్పడిన ప్రతి సందర్భంలోను సాహిత్యకారులను ఏకం చేస్తూ రచనల ద్వారా జనాన్ని చైతన్య పరుస్తున్నారని తెలిపారు. పెనుగొండ రాసిన దీపిక అనే విమర్శ గ్రంథానికి పురస్కారం లభించిందని, ఆయన రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర భావి పరిశోధకులకు ఒక నమూన గ్రంథంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రతి జిల్లా నుంచి ఇలాంటి చరిత్రలు రావడానికి ఇది ప్రేరణ ఇచ్చిందని తెలిపారు. అరసం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పెనుగొండకు పురస్కారం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా ధరించాలి

● అర్బన్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి

● రాయచోటిలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

రాయచోటిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని ద్విచక్ర వాహనదారులకు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ కృష్ణమోహన్ నేతృత్వంలో గురువారం రాయచోటిలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని అర్బన్ సీఐ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈర్యాలీ స్థానిక శివాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. లక్షలాది రూపాయలు వ్యయం చేసి బైక్‌లు కొన్నవారు హెల్మెట్ వాడకపోవడంతో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం వల్లనే అధికంగా మృత్యువాతపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేని పక్షంలో పోలీసు చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ ర్యాలీలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు, శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఐ చంద్రశేఖర్

ఇంధన పొదుపుతో భవిష్యత్తులో వెలుగులు

చెన్నూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వాడే ఇంధనాన్ని ముందు జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలని తద్వారా భవిష్యత్తులో వెలుగులు చూడవచ్చని ట్రాన్స్‌కో ఈఈ హరిసేవియానాయక్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు భవిష్యత్తులో ఇంధన అవసరాలు గుర్తించాలన్నారు. రాబోవు కాలంలో బొగ్గు నిల్వలు తగ్గుతాయని.. అలాంటప్పుడు ఇంధన కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. సౌరశక్తిని ఎక్కువగా వాడే విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నా రు. విద్యార్థులు తమ కుటుంబాల్లో తల్లిదండ్రులకు ఇంధన పొదుపు గురించి చెప్పడంతో పాటు సౌరశక్తి వాడడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. అంతేకాక ఆఫీసులు, కళాశాలలు, పాఠశాలలు, పరిశ్రమలు లాంటి చోట వారి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఫ్యాన్లు, లైట్లు, స్విచ్ఛాఫ్ చేయాలన్నారు. అనవసరంగా ఫ్రిజ్‌లు తెరిచిమూయడం, నాసిరక బల్బులు వాడడం, రైతులు మోటర్లను ఆటోమేటిక్ ఏర్పాటు చేసుకోవడం లాంటి వాటి వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఇంధన పొదుపుపై రాత పరీక్ష నిర్వహిం చి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పోస్టర్లను కూడా విడుదల చేశారు. ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రామలింగారెడ్డి, సబ్ ఇంజనీరు స్రవంతి, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ట్రాన్స్‌కో ఈఈ హరిసేవియానాయక్

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ భారతజాతి ముద్దుబిడ్డ, బహుజనుల ఆశాజ్యోతి అయిన అంబేడ్కర్‌ను తలుచుకుంటే ఏమొస్తుంది అంటూ వ్యాఖ్యానించిన అమిత్‌షాను తక్షణం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి, భారతజాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ,జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, ఎంవీ సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, కే.సి.బాదుల్లా, ఇమ్మానియేల్, కె.మునయ్య తదితరులు పాల్గొన్నారు.



కడపలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న డీహెచ్‌పీఎస్, సీపీఐ సభ్యులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...: అంబేడ్కర్‌పై కేంద్ర హంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గమని, వెంటనే పదవికి రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అఫ్జల్‌ఖాన్, అలీఖాన్, బండిజకరయ్య తదితరులు పాల్గొన్నారు

రాయచోటిలో...: అంబేడ్కర్‌ను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం వారు రాయచోటి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపశిల్పి అయిన డాబీఆర్ అంబేడ్కర్ గురించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు భారతజాతిని అవమానించినట్టేనన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, రామాంజనేయులు, విశ్వనాథ నాయక్, పల్లం తాతయ్య, సాంబశివ, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యో... ఎంత కష్టం



● కంపచెట్ల పాలైన పసికందు

జమ్మలమడుగు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'ఆ తల్లికి ఎంత కష్టం వచ్చిందో తెలియదు. ఎవరు చేసిన పాప ఫలితమో అంతుచిక్కడంలేదు. గజగజమని చలి వణికిస్తున్నా అభం, శుభం తెలియని పసికందును కంపచెట్లలో పడేసి వెళ్లారు. వివరాల్లో కెళితే... స్థానిక ముద్దనూరు రోడ్డులోని ఎత్తపువారి కాలనీ రోడ్డు పక్కన గనిగుంతల కంపచెట్లలో ఒక రోజు వయసున్న బిడ్డను కంపచెట్లలో పడేసి వెళ్లారు. ఎప్పుడు పడేశారో తెలియదు కాని గురువారం వేకువజామున బహిర్భూమికి వెళ్లిన లూకా అనే వ్యక్తికి ఏడుపు వినిపించడంతో.. ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా.. రోజు వయసున్న పసికందు కనిపించింది. అప్పటికే శరీరానికి చీమలు ఎక్కి శరీరమంతా తిరుగాడుతున్నాయి. వెంటనే ఆయన పసికందును చేతికి తీసుకుని చీమలను తొలగించి నీటితో శుభ్రం చేశాడు. ఈసమాచారాన్ని పోలీసులకు చేరవేశాడు. ఈవిషయం తెలియడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మనిషికో మాట మాట్లాడుతూ వెళుతున్నారు తప్ప బిడ్డ ఆలనా పాలనపై ఎవరూ నోరెత్తడం లేదు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు పసికందును స్థానిక అంగన్వాడీ కేంద్రానికి అప్పగించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. రోజు వయసున్న పసికందు ఆరోగ్యంగానే వున్నట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయితే పసికందును సంరక్షించాలంటే కడప చైల్డ్ ప్రొటక్షన్ హోమ్‌కు తరలించాలని నిర్ణయించారు. ఆమేరకు కడప చైల్డ్ హోమ్ వారికి సమాచారం అందించి అక్కడికి తరలించారు. పోలీసులు, అంగన్వాడీ పర్యవేక్షణలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై అర్బన్ సీఐ లింగప్ప ఎస్ఐ రామకృష్ణ ఆరా తీస్తున్నారు.



అంగన్వాడీ, మహిళా పోలీసు పర్యవేక్షణలో పసికందు

కోదండరామున్ని దర్శించుకున్న ఆముదాల వలస ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రవికుమార్‌ను సత్కరిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామున్ని ఆముదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ చరిత్రను, విశిష్టతను తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. రామాలయంలో శిల్ప సంపద భావితరాలకు ఉపయోగపడే విధంగా ఉందని, రాబోయే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు పవన్‌కుమార్, టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

● చమర్తి జగన్‌మోహన్‌రాజుకు గురుకుల టీచర్స్, లెక్చరర్ల వినతి

రాయచోటిటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకులాల్లో గత పది సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న టీచర్లు, లెక్చరర్లకు న్యాయం చేయాలని ఆ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన బిడ్డల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ అతి తక్కువ జీతంతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, ప్రభుత్వ విధానంలో అవుట్ సోర్సింగ్ విధానమే లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు జగన్‌మోహన్‌రాజును కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుళ్లాయప్ప, విజయలక్ష్మి, సుమతి, స్వర్ణలత, మహేదేవ, కదాంబరి, రహీమ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు పనులు ఎప్పుడో..?

● పాతికేళ్లుగా హామీలకే పరిమితమైన వైనం ●అమలుకు నోచుకునేదెప్పుడంటున్న జనం ● అధ్వానంగా నిమ్మనపల్లె, రామసముద్రంరోడ్డు

మదనపల్లె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో కీలకమైన రామసముద్రం, నిమ్మనపల్లె రోడ్ల విస్తరణ పనులు హామీలకే పరిమితమయ్యాయి తప్ప కార్యరూపం దాల్చడం లేదు. పాలకులు వస్తున్నా..ప్రభుత్వాలు మారుతున్నా..ఈ రోడ్ల రూపురేఖలు మాత్రం మారడం లేదు. నియోజకవర్గం కేంద్రమైన మదనపల్లె రావాలంటే.. అటు నిమ్మనపల్లె, ఇటు రామసముద్రం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మదనపల్లె- నిమ్మనపల్లె, మదనపల్లె-రామసముద్రం రోడ్లను డబుల్‌రోడ్లుగా మారుస్తామని ఎమ్మెల్యే నుంచి ఎంపీ వరకూ చెబుతూనే ఉన్నారు. కానీ ఏళ్లు గడుస్తున్నా..ఆ పని మాత్రం జరగడం లేదు. మదనపల్లె నుంచి నిమ్మనపల్లె 27 కి.మీ. రామసముద్రం 30కి.మీ.దూరం ఉంది. ఇరుకైన సింగిల్‌రోడ్డు కావడం, దానికి తోడు గుంతల మయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు మారినప్పుడల్లా.. డబుల్‌రోడ్డు మంజూరైందని, ఇక పనులే మొదలు కావాల్సిఉందని చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా పనులు జరగడం లేదు. 2014 టీడీపీ ప్రభుత్వం హయాంలో మదనపల్లె-నిమ్మనపల్లె మార్గంలో ఆచార్లపల్లె నుంచి చల్లావారిపల్లె వరకు అయిదు కి.మీ. విస్త రించగా, గత వైసీపీ ప్రభుత్వంలో మదనప ల్లె-రామసముద్రం మార్గంలో బొమ్మనచెరువుకు- దాదినాయునితాండా మధ్యలో ఒకచోట, కట్టుబా వి-పన సమానుకుంట మధ్యలో ఒకచోట మలుపులను స్ట్రయిట్ చేశారు. అంతకుమించీ పాతికేళ్లుగా విస్తరణ పనులు చేపట్టలేదు. దీంతో వాహనదారులు, రైతులను ఇప్పటికీ అదే సమస్య వెంటాడుతోంది. రామసముద్రం మార్గం అయితే మరీ దారుణంగా ఉంటోంది. కొండలు, గుట్టలు, మలుపులు, ఎత్తయిన ప్రదేశం కావడంతో ఎదురుగా వాహనం వస్తే..మరోవాహనం కిందకు దిగే పరిస్థితి ఉండదు. ఇక రాత్రివేళ అయితే మరీ ఇబ్బందిగా ఉంటోంది. ఇదిలావుండగా, కొద్దిపాటి వర్షానికే గుంతలు, గోతులుమయం కావడంతో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎప్పటికప్పుడు కనీసం గోతులను కూడా పూడ్చకపోవడంతో అవి మరింత విస్తరించి రోడ్డు కనుమరుగవుతోంది. ఇందులోభాగంగా మండలంలోని ఈశ్వరమ్మకాలనీ, కొత్తపల్లె సమీపంలో రోడ్డు కోసుకుపోయింది. కిలోమీటరు మేర రోడ్డు గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచి బురద మయం అయింది. ఇక్కడ గుంతలు తప్ప..రోడ్డు మచ్చుకైనా కనిపించడం లేదు. ఇక నిమ్మనపల్లె మార్గంలో తీసుకుం టే..బసినికొండ నుంచి ఎగువ మాచిరెడ్డిగారిపల్లె వరకూ మొత్తం గుంతలు ఏర్పడ్డాయి. బస్సులే కాదు..ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో వెళ్లడానికి, ముఖ్యంగా రాత్రివేళలో ప్రయాణం అంటేనే ప్రయాసగా మారింది. ఈ రెండు మార్గాల నుంచి ప్రజలు..నిత్యం మదనపల్లెకు వివిధ పనుల మీద వస్తుంటారు. ముఖ్యంగా రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తెస్తుంటారు. ఇరుకు, గుంతల రోడ్లతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


నిమ్మనపల్లె -రాచవేటివారిపల్లె వద్ద గుంతలు ఏర్పడిన రోడ్డు


కొత్తపల్లె సమీపంలో బురదమయం అయిన రామసముద్రం రోడ్డు


మదనపల్లె సమీపంలోని ఈశ్వరమ్మకాలనీ వద్ద రోడ్డు దుస్థితి

కష్టపడి పనిచేశాం... తగిన గుర్తింపు కల్పించండి

● మంత్రి లోకేశ్‌కు టీడీపీ నేత సిద్ధా వినతి

ములకలచెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచే శాం....త గిన గుర్తింపు కల్పించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన నారా లోకేశ్‌ను కలిసి పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో వెన్నంటే ఉన్నానని, అంగళ్ళ కేసులో తమపై తప్పుడు కేసులు పెట్టారని, వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా కష్టపడి పనిచేశానని వివరించారు. తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన విన్నవించారు.


నారా లోకేష్‌తో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ఎమ్మెల్సీని కలిసిన జనసేన నేత

ములకలచెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో గురువారం తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ ఎమ్మెల్సీ, జనసేన పార్టీ మీడియా అధినేత పిడుగు హరిప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సాయినాథ్ పేర్కొన్నారు.


ఎమ్మెల్సీని కలిసిన జనసేన సాయినాథ్

మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ


జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో అందుకుంటున్న విద్యార్థిని చందన

ములకలచెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మోడల్ స్కూల్ విద్యార్థిని చందన మన సంస్కృతి - తెలుగు ప్రతిభ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న చందన ఇటీవల జరిగిన పరీక్షలో ప్రతిభ చూపి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంతో హైదరాబాదులో సినీ గేయ రచయిత సద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకుంది.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

మదనపల్లె టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విద్యార్థులు సృజనాత్మక పెంపొందించుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్ అనే అంశాలపై రెండు రోజుల సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్‌కే ఆటోమోటివ్స్ జనరల్ మేనేజర్ గోవిందరావు మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌తో పాటు క్రియేటివ్ లక్షణాలు అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ హెచ్‌వోడీ లక్ష్మయ్య, కోఆర్డినేటర్ శివశంకరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను విజయవంతం చేయండి

మదనపల్లె టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఈనెల 28,29 తేదీల్లో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. గురువారం మదనపల్లెలో విద్యార్థులతో కలసి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కార్తీక్, రమణ, జయబాబు, అఫ్రీద్ పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పెంచాలి

మదనపల్లె టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పెంచాలని ఎంపీడీవో తాజ్ మస్రూర్ సూచించారు. గురువారం పొన్నేటిపాళెం పంచాయతీ పనసమాకులపల్లెలో రూ.19లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. అలాగే మినీగోకులాల పనులను పరిశీలించి వాటిని వేగవంతం చేయాలని ఏపీఎం సుబ్రమణ్యంను ఆదేశించారు. గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులకు వెళితే తప్పనిసరిగా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వివిధ సేవల కోసం సచివాలయానికి వచ్చే ప్రజలను గౌరవిస్తూ వారి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కోళ్లబైలు-2 గ్రామ పంచాయతీ వెంకటేశ్వరపురంలో రూ.2లక్షల పంచాయతీ నిధులతో వేస్తున్న బోరు డ్రిల్లింగ్ పనులను ఎంపీడీవో ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు షబీనా, గిరిధర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


పనసమాకులపల్లెలో సీసీరోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

దొంగకు దేహశుద్ధి చేసిన గ్రామస్థులు

గుర్రంకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):దుకాణాలు, ఇళ్లలో మనుషులు లేనిసమయంలో చోరీలకు పాల్పడుతున్న దొంగకు స్థానికులు దేహశుద్ధి చేసిన సంఘటన గుర్రంకొండ కొత్తపేటలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు పెద్దమండ్యం మండలం కలిచెర్ల పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప గుర్రంకొండ పట్టణంలో గతంలో పలు దుకాణాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో గురువారం ఓ వెల్డింగ్ షాపులో యజమాని లేని సమయంలో ఇనుప వస్తువులను చోరీ చేస్తుండగా పట్టుకుని అక్కడే కట్టేసి దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు అప్పగించారు.

ఇరువర్గాల మధ్య గొడవ

● స్థానికులు ఫొటోలు తీయడంతో జారుకున్న వైనం

మదనపల్లె, అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాఠశాల వదిలిన సమయంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురు రోడ్డులో ఇరువర్గాలకు విద్యార్థులు గురువారం గొడవపడ్డారు. దీంతో విద్యార్థులు అందరూ అక్కడ గుమికూడారు. దీంతో అటుగా వెళుతున్న స్థానికులు ఫొటోలు, వీడియోలు తీయడంతో వారు చిన్నగా అక్కడ నుంచి జారుకున్నారు. పలు మార్లు పాఠశాల సమీపంలో విద్యార్థులు గొడవలు పడడటం పరిపాటిగా మారుతోంది. ఇటు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అటు పోలీసుల చొరవ చూపి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

సుస్థిరావృద్ధి లక్ష్యం కోసం కృషి చేయాలి

పెద్దమండ్యం, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి) గ్రామాల సుస్థిరాభివృద్ధి లక్ష్యం కోసం సమష్టిగా కృషి చేయాలని పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు కోరారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రభుత్వం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కోసం మండల శాఖ అధికారులు, సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు వినియోగం, ప్రతిపాదన అంశాలను వివరించారు. మండల శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీధర్‌రావు

తంబళ్లపల్లెలో: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, సర్పంచులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి నిర్మాణాత్మకంగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, ఏపీవో అంజినప్ప, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నిశాఖల సమన్వయంతో గ్రామాల ప్రగతి

కలకడ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):అన్ని శాఖల సమన్వయంతో ప్రగతి సాధ్యమవుతుందని ఎంపీడీవో అబ్దుల్ రహీం అన్నారు. సుస్థిర అభివృద్ధి కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పారిశుధ్యం, ఆరోగ్యం, విద్య మౌలిక వసతులు మొదలగు ప్రజా సమస్యలపై వెంటనే స్పందిచాలని సూచించారు. అలాగే ప్రజాప్రతినిధుల సహకారంతో పంచాయతీల ఆర్థిక అభివృద్ధి సాధించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈవోఆర్డీ వెంకట సుబ్బయ్య, డాక్టర్లు మల్లికార్జున, మోహన్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఆర్‌సీ సేవలను మహిళలకు వివరించాలి

మదనపల్లె టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో ఏర్పాటు చేసిన మోడల్ జీఆర్‌సీ సేవలను మహిళలు ఉపయోగించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఏపీఎం సుబ్రమణ్యం పేర్కొన్నారు. గురువారం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్సు సెంటర్‌లో మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, గృహహింస తదితర వాటిపై జీఆర్‌సీలో ఫిర్యాదు చేయాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండానే మహిళలకు జీఆర్‌సీలో న్యాయం జరుగుతుందన్నారు.

రెవెన్యూ సమస్యలతో పాటు సంక్షేమం కోసం అర్జీలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కొత్తపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెవెన్యూ, భూ సమస్యలతో పాటు సంక్షేమ పథకాలు కేటాయిం చాలని పలువురు అర్జీలు అందజేశారు. గురువారం కొత్తపల్లెలో హంద్రీ-నీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా బుగ్గవంక, ఈశ్వ రమ్మకాలనీకి చెందిన కొందరు ప్రజలు మాట్లాడుతూ తమ ఇళ్ల స్థలాలు దేవదాయశాఖ భూముల కింద రికార్డుల్లో చూపిస్తున్నారని, వాటిపై సర్వే నిర్వహించి తమ స్థలాలు క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. వాటితో పాటు రేషన్‌కార్డులు, కొత్త పింఛన్ల మంజూరు, హౌసింగ్ పథకంలో ఇళ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని పలువురు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అస్లాంబాషా, ఆర్‌ఐ శేషాద్రిరావు తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ కలెక్టర్

వాగు పొరంబోకు స్థలాన్ని రక్షించండి

గుర్రంకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఆక్రమణలకు గురైన వాగు పొరంబోకు స్థలాన్ని రక్షించాలంటూ రుద్రవాండ్లపల్లె, ఇరగన్నగారిపల్లె గ్రామస్థులు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని తరిగొండలో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజలు, రైతులు లిఖితపూర్వకంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి సమీపంలోని సర్వే నెంబరు 1049లో 36.70 ఎకరాల్లో వాగు పొరంబోకు స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని కంచె ఏర్పాటు చేశారని దీంతో గ్రామస్థులు పొలాలకు వెళ్లడానికి దారి లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికా రి లక్ష్మీపతి, నాయకులు చంద్రబాబు, నౌషాద్‌అలీ, జయప్రకాశ్, అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

కురబలకోట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తంబళ్లపల్లె టీడీపీ నేత జయచంద్రారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు సీడుమల్లికార్జుననాయుడు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎర్రబల్లిలో గ్రామరెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న వివిధ రకాల భూ సమస్యలతో పాటుగా వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయని వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల సమస్యలపై 56 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ భరత్‌కుమార్, తహశీల్దార్ తపస్విని, ఆర్‌ఐ బాలసుబ్రమణ్యం, వైజీ సురేంద్ర పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: గ్రామీణ ప్రాంతాలలో రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంచూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, సర్వేయర్ పూర్ణచంద్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుగుణ, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సదస్సులు సద్వినియోగం చేసుకోండి

పెద్దమండ్యం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివ పిలుపునిచ్చారు. గురువారం పెద్దమండ్యం గ్రామ సచివాలయంల వద్ద రైతు సదస్సులో పీడీ మాట్లాడుతూ రైతు సదస్సులో అన్నిశాఖల సమస్యలపై 91 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, రెడ్డమ్మకొండ ఈవో మంజుల, కూటమి నేతలు గంగాధర, నాగరా జా, జీవీరమణ, మహేశ్వర, రెడ్డిహుస్సేన్, మస్తాన్, చలపతినాయుడు, రెడ్డిపీరా పాల్గొన్నారు.

కలకడలో:మండలంలోని కేడొడ్డిపల్లె గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా భూ యజమానులు డీటీ భార్గవికి తమ భూ సమస్యలను తెలిపి అర్జీలను అందజేశారు. కాగా సదస్సులో మ్యూటేషన్‌లకు సంబంధించి 2, రీ సర్వే కొరకు 6, ఈ పాసుపుస్తకాల కోసం 2 కలిపి మొత్తం 11 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మద్దిపట్ల వెంకట్రామయ్య చౌదరి, సర్వేయర్ దేవి, వీఆర్వో స్వర్ణలతలు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలలో భూ సమస్యలపై అర్జీల వెల్లువ

నిమ్మనపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీలో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలో భూ సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ ధనంజేయులు మాట్లాడుతూ భూ సమస్యలు కలిగిన వారు మాత్రమే అర్జీలు అందజేశారని తెలిపారు. అయితే ఎక్కువగా దారి సమస్యలు వన్‌బి, తల్లిదండ్రుల ఆస్తులు మార్పుకొరకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అనంతరం రెవెన్యూ గ్రామ సభలలో 300వరకు వివిధ అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగరాజ నాయుడు, టీడీపీ నాయకులు గణేష్, సుధాకర్‌రావు, మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై పెద్దతిప్ప సముద్రం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు అయినట్లు ఏఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. పట్టే వాండ్లపల్లె పంచాయతీ బాగేపల్లెకు చెందిన సుజాత తన కుమార్తె కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోందని బుధవారం రాత్రి నుంచి కనిపించకోవడంతో చుట్టుపక్కల బంధువులు అందరినీ విచారించిన కనిపపించలేదని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆమె. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు.

కురబలకోటలో విద్యార్థిని అదృశ్యం

కురబలకోట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంగళ్లు సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. మండలంలోని నందరెడ్డిగారిపల్లె పంచాయతీ వినాయక చేనేత నగరుకు చెందిన విద్యార్థిని అంగళ్లు జడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం ఇంటి నుంచి ఆటోలో బయలుదేరిన విద్యార్థిని ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో కుటుంబీకులు చుట్టపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వమత సమానత్వమే మన ధ్యేయం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సర్వ మత సమానత్వమే మన ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్‌బాబు ఆధ్వర్యంలో గురువారం రాయల్ అరేబియా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యతిథిగా ఎమ్మెల్యే పాస్టర్స్‌కు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందస్తు క్రిస్మస్ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులకు టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని విధాల ఆదుకుంటామని, సమాదులతోటకు స్థలం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా క్రైస్తవ పాస్టర్లు, క్రైస్తవులు పార్థనలు నిర్వహించారు, కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జాన్సన్, కమిటీ సభ్యులు సుధాకర్, జయకుమార్, జాన్సన్, ఎలిసా, సామేలు, సామ్సన్, పెద్ద సంఖ్యలో క్రైస్తవలు పాల్గొన్నారు.


సెమీక్రిస్మస్ సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తంబ ళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థాని క పార్టీ కార్యాలయంలో గురు వారం ఎస్టీయూ- 2025 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బడిబయట పిల్లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు సీడుమల్లికార్జుననాయుడు, ఎస్టీయూ నాయకులు అమరనాథరెడ్డి, రాజా రెడ్డి, వెంకటరమణ, నౌషాద్, రమణప్ప, నాగరాజు, రమణానాయక్, మల్లికార్జున, ప్రభాకర్‌రెడ్డి, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

మదనపల్లె టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఇళ్లలో పొదుపుగా విద్యుత్‌ను వినియోగిస్తూ భవిష్యత్ అవసరాలకు నిల్వ చేయాలని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ పేర్కొన్నారు. గురువారం ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం నుంచి ఉద్యోగులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ గృహాల్లో ఎల్‌ఈ డీ బల్బులు, స్టార్ రేటెడ్ ఉపకరణాలనే ఉపయోగించాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ సర్వీసెస్‌ను పెంచాలన్నారు. డీఈలు సురేంద్రనాయక్, హరికుమార్, ఏఏవో కిరణ్‌కు మార్, జేఏవో రెడ్డెప్ప, గణేష్‌బాబు, ఏఈ లు కుమార్‌బాబు, అజయ్,ముజమ్మిల్, రమేష్, రామ్మూర్తి,ఉత్తన్న, నాగరాజ పాల్గొన్నారు.


ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీడీసీఎల్ ఉద్యోగులు

అమిత్‌షా వ్యాఖ్యలపై వీసీకే పార్టీ ఆగ్రహం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్రహోం మంత్రి అమిత్‌షాచేసిన వ్యాఖ్యలపై వీసీకే పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్‌మీద, ఆయన రాయించిన రాజ్యాంగమీద గౌరవంలేని కేంద్రహోం మంత్రి రాజ్యాంగబద్ధమైన పదవుల్లో కొనసాగే అర్హత లేదన్నారు. వెంటనే మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ వల్లే తాను ప్రధాని అయ్యానని చెప్పుకునే మోదీ అమత్‌షా వ్యాఖ్యలపై మౌనంగా ఉండడం సహేతుకం కాదన్నారు. వెంటనే అమిత్‌షా క్షమాపణ చేప్పి తన మంత్రిపదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యమలా చంద్రయ్య, గుండామనోహర్, మల్లెల మోహన్, లక్ష్మీపతి, అప్పయ్య, రమేష్, రమణ, మోహన్, నారాయణ పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల నిరసన

వాల్మీకిపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అమిషా అంబేద్కర్‌ను ఏకవచనంతో మాట్లాడటం పట్ల నిరసనలు తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి అమిత్‌షా తన మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి శివారుపల్లి సుధాకర్, మండల అధ్యక్షుడు నాగార్జున, ఉపా ధ్యక్షులు మహేష్ ప్రవీణ్, రమణ, వెంకటముని, కుప్పుస్వామి, సూరి నారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉన్నత పాఠశాలకు బీరువాలు వితరణ

మదనపల్లె అర్బన్, డిజెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలోని మాయ బజార్‌లో మున్సిపల్ వివేకానంద ఉన్నత పాఠశాలకు దాతలు రెండు బీరువాల తోపాటు వివిధ వస్తువులను వితరణ చేశా రు. క్రిస్టియన్ బీఎడ్ కళాశాల విద్యా ర్థులు రూ.20వేలు విలువ చేసే రెండు బీరువాలు, సుధాకర్ అనే విద్యార్థి పెద్ద టీ ప్లాస్కు, ఉపాధాయుని మధురాణి 24 స్టీలుగ్లాసులు, వితరణ చేశారు. వారం దరిని ఈ పాఠశాల హెచ్‌ఎం పురం వెంకటరమణ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్, అంజనప్ప, జ్యోతి, శోభారాణి, మధురాణి, హసీనా, వెంకట్, నారాయణ, రెడ్డిశేఖర్, రఘు, అరుణకుమారి, రాజేశ్వరి సావిత్రమ్మ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలకు రెండు బీరువాలు వితరణ చేసిన క్రిస్టియన్ కాలేజీ విద్యార్థులు

మా భూమిని మాకు ఇప్పించండి

● బాధితుల వేడుకోలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 19 (ఆం ధ్రజ్యోతి):కబ్జాకు గురైన మా భూమిని మాకు ఇప్పించి ఆదుకోవాలని గురువా రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో బాధితులు వేడుకున్నారు. ఈ మేరకు బాధితులు శ్రీనివాసులు, రాజేశ్వ రి, పార్వతమ్మ, ఆయేషాలు మాట్లాడుతూ బసినికొండ గ్రామం వెంకప్పకోట సర్వేనెంబరు 1072-1లో మూడు ఎకరాలు భూమిని మా తండ్రి పరదాని చిన్నస్వామి పేరిట ప్రభుత్వం పట్టా, పాసుబుక్కు ఇచ్చిందన్నా రు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన రాజకీయ నాయకుడు ఓ సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తమ పొలం సమీపంలో క్వారీని నిర్వహిస్తూ అక్రమంగా మా భూమిని కబ్జా చేశారని మమ్మలిని భూమిలోకి రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవ చూపి మా భూమినిక మాకు ఇప్పించి ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు వేడుకున్నారు.

పశుగణన పక్కాగా నమోదు చేయాలి

తంబళ్లపల్లె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పశుగణనపై పశువైద్య సిబ్బంది దృష్టి సారించి గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబంలో పెంచుకుంటున్న ప్రతి జంతువు పేరు పక్కాగా నమోదు చేసుకోవాలని పశుసం వర్ధక శాఖ డీడీ సత్యనారాయణ సూచించారు. గురువారం ఆయన తంబళ్లపల్లె పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి మండలంలో చేపడుతున్న పశుగణన సర్వే కార్యక్ర మంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమ త్తంగా ఉండి పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలు గ్రామాలలో పర్యటించి గోకులాల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె పశువైద్య కేంద్రం ఏడీ సుమిత్ర, మండల పశువైద్యురాలు సుజనశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.